




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక :53 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం శనివారం 7 మార్చి 2026 వెల : 5/-రూ ॥


VOLUME :1 ISSUE : 53 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM SAT 7 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు

- ఇరాన్ బేషరతుగా లొంగిపోతేనే ఒప్పందం ఉంటుందన్న ట్రంప్
- యుద్ధం ముగిశాక ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని హామీ
- ట్రంప్ సరికొత్త నినాదం.. 'మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్'
- హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను ముంచేసిన అమెరికా సబ్‌మెరైన్
- యుద్ధం దెబ్బకు 90 డాలర్లకు చేరిన ముడిచమురు ధరలు

- మిగతా 2లో





## కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయి

### ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్



- అమెరికా ఇజ్రాయెల్ యుద్ధంపై స్పందించిన ఇరాన్ అధ్యక్షుడు
- కొన్ని దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తున్నాయన్న మసూద్ పెజెష్కియాన్
- ఇజ్రాయెల్ పైకి అత్యాధునిక ఖోరంషహర్-4 క్షిపణుల ప్రయోగం
- ఇరాన్ నేవీని నామరూపాల్లేకుండా చేశామన్న అమెరికా
- భారీ బాంబులతో ఇరాన్ అణు కేంద్రాలపై విరుచుకుపడ్డ బి-2 బాంబర్లు

- మిగతా 2లో




## నేడు ఢిల్లీలో 110 దేశాల ప్రతినిధులతో సదస్సు...

### ఏపీ బ్రాండ్ ఇమేజ్‌పై సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్

- నేడుఢిల్లీలో రైసినా డైలాగ్ 2026 సదస్సు
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- సాంకేతికత వినియోగం మరియు సుపరిపాలనపై కీలక ఉపన్యాసం చేయనున్న ముఖ్యమంత్రి
- సదస్సుకు హాజరుకానున్న 110 దేశాలకు చెందిన 2,700 మంది అంతర్జాతీయ ప్రతినిధులు
- రియల్ టైమ్ గవర్నెన్స్ సహా ఏపీ మోడల్‌ను ప్రపంచానికి వివరించనున్న చంద్రబాబు

పెన్ పవర్ డెస్క్:ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తిని మరోసారి చాటేందుకు, రాష్ట్రం లో అమలు చేస్తున్న వినూత్న పాలనా విధానాలను అంతర్జాతీయ సమాజానికి వివరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధమయ్యారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరగనున్న అత్యంత ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ఆయన శనివారం హాజరుకానున్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సులో సీఎం పాల్గొని, 'సాంకేతికత - సుపరిపాలన', భవిష్యత్ సవాళ్లు అనే అంశాలపై కీలక ఉపన్యాసం చేయనున్నారు.

**ప్రపంచం దృష్టిని ఆకర్షించే వేదిక**

ప్రపంచ రాజకీయాలు, అంతర్జాతీయంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థపై చర్చించేందుకు అత్యున్నత వేదికగా

- మిగతా 2లో

## విపక్షం లేకున్నా ఐదు కోట్ల ప్రజల కోసమే చర్చలు

- 15 రోజుల పాటు అసెంబ్లీలో చర్చలు జరిపినట్లు చంద్రబాబు వెల్లడి
- గత పాలకుల విధ్వంసం నుంచి ఏపీ పునర్నిర్మాణం జరుగుతోందని ఉద్ఘాటన
- సభలో లేకుండా పారిపోయిన పార్టీ ప్రతిపక్ష హోదా కోసం డిమాండ్ చేస్తోందని ఎద్దేవా
- ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్న సీఎం



పెన్ పవర్ డెస్క్:గడచిన పదిహేను రోజులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ వేదికగా కేవలం చట్టాలు చేయడం మాత్రమే కాకుండా, రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా అర్థవంతమైన చర్చలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల ముగింపు సందర్భంగా సభలో ఆయన ప్రసంగిస్తూ.. ప్రత్యర్థి పార్టీ సభకు గైర్హాజరై ప్రజా సమస్యలను గాలికొదిలేసినప్పటికీ, తాము మాత్రం ప్రజల ఆకాంక్షలే అజెండాగా ముందుకు సాగామని తెలిపారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

రాష్ట్ర విభజన కష్టాలకు తోడు, గత పాలకుల విధ్వంస పాలన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఇప్పుడు ఇటుక ఇటుక పేర్చి పునర్నిర్మాణం చేసుకోవాల్సి వస్తోందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే కూటమి పక్షాలన్నీ పూర్తి సఖ్యతతో ఉన్నాయని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని వివరించారు. గత ఎన్నికల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థుల్లో 94 శాతం మందిని ప్రజలు గెలిపించారని, ఇది తమపై జనం పెట్టుకున్న నమ్మకానికి నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, అభివృద్ధి, సంక్షేమాలను సమన్వయం చేస్తున్నామన్నారు.ప్రతిపక్షం తీరుపై సీఎం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామని చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజలు ఓట్లు వేస్తేనే అధికారం లేదా ప్రతిపక్ష హోదా వస్తాయని హితవు పలికారు. బాధ్యత గల పార్టీగా సభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు. గడచిన 20 నెలల పాలనలో ఎన్నో కష్టాలను అధిగమించామని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేసి సూపర్ హిట్ చేశామని సగర్వంగా ప్రకటించారు. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు, విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నామన్నారు.గత ప్రభుత్వం కేంద్ర నిధులను, పథకాలను నిర్వీర్యం చేసిందని చంద్రబాబు ధ్వజమెత్తారు. 92 కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 85 పథకాలు నిధుల మళ్లింపు వల్ల నిర్వీర్యం అయిపోయాయని గణాంకాలతో సహా వివరించారు. ముఖ్యంగా 'జల్ జీవన్ మిషన్' కింద రాష్ట్రానికి రూ.85 వేల కోట్లు రావాల్సి ఉండగా, గత పాలకులు కేవలం రూ.25 వేల కోట్లకే ప్రతిపాదనలు పంపి, చివరకు రూ.2500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మండిపడ్డారు.

- మిగతా 2లో



### వైసీపీ సభ్యులపై అసహనం వ్యక్తం చేసిన శాసనమండలి చైర్మన్

- గీతం యూనివర్సిటీ భూములపై వాయిదా తీర్మానం ఇచ్చిన వైసీపీ
- వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన మండలి చైర్మన్
- నినాదాలతో సభను హోరెత్తించిన వైసీపీ సభ్యులు

- మిగతా 2లో



### ఇకపై పొరపాట్లు జరగవు..

## గతం గతః

- కొలికపూడి, కేశినేని చిన్ని మధ్య కొంత కాలంగా విభేదాలు
- తన వల్ల పార్టీకి ఇబ్బంది కలిగినందుకు కొలికపూడి విచారం
- కులం కార్డు వాడటం తన అభిమతం కాదని స్పష్టీకరణ

- మిగతా 2లో



## బొత్సకు మళ్లీ అస్వస్థత...

### పరిస్థితి గమనించి సూచన చేసిన పయ్యావుల


- శాసనమండలిలో ప్రసంగిస్తుండగా బొత్సకు అస్వస్థత
- విషయం గమనించి విశ్రాంతి తీసుకోవాలన్న మంత్రి పయ్యావుల
- వెంటనే మండలికి చేరుకుని పరీక్షలు చేసిన వైద్యులు
- బీపీలో హెచ్చుతగ్గుల వల్లే ఇబ్బంది పడ్డారని వెల్లడి
- ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందన్న డాక్టర్లు

- మిగతా 2లో

## అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో వందలాది చిన్నారులు మృతి

### యూనిసెఫ్ ఆందోళన

- యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో 181 మంది చిన్నారులు మృతి
- లెబనాన్‌లో 7గురు, ఇజ్రాయెల్‌లో ముగ్గురు, కువైట్‌లో ఒకరు మృతి
- వెల్లడించిన ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ యూనిసెఫ్



పెన్ పవర్ డెస్క్:అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దాడుల కారణంగా పశ్చిమాసియాలో వందల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని యూనిసెఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. గత నెల 28న ప్రారంభమైన యుద్ధం నేటితో ఏడవ రోజుకు చేరుకున్నది. ఈ యుద్ధంలో అత్యధికంగా ఇరాన్‌లో చిన్నారులు చనిపోయినట్లు తెలిపింది. ఇరాన్‌లో 181 మంది, లెబనాన్‌లో 7గురు, ఇజ్రాయెల్‌లో ముగ్గురు, కువైట్‌లో ఒకరు మృతి చెందినట్లు వెల్లడించింది. యుద్ధాలను పిల్లలు ప్రారంభించరని కానీ వారు కూడా మూల్యం చెల్లించుకుంటున్నారని పిల్లల హక్కులు, ఆరోగ్యం,

- మిగతా 2లో



## సీఎం, డిప్యూటీ సీఎం వంటి స్థానాల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా ఉండాలి

- రాజకీయ లబ్ధి కోసం దేవుడిని వాడుకోవడం సరికాదన్న రోజా
- కూటమి నేతలు పుణ్యక్షేత్రాల ప్రతిష్టను దిగజార్చుతున్నారని మండిపాటు
- హామీలు నెరవేర్చలేకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని హితవు

పెన్ పవర్ డెస్క్:ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ...


- మిగతా 2లో

## ఈ నెలాఖరు నాటికి నక్సలిజం పీడ విరగడవుతుంది

- దేశాన్ని నక్సలిజం రహితంగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుందన్న అమిత్ షా
- సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్లపై ప్రశంసలు
- ఆయుధాలు పట్టే వారికి ఆయుధాలతోనే సమాధానం ఇస్తామని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరోసారి స్పష్టం చేశారు. ఒడిశాలోని కటక్‌లో జరిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# యోగా పితామహుడు యోగానంద

పరమహంస యోగానంద 1893 జనవరి - 1952 మార్చి 7) భారతీయ సన్యాసి, యోగి, ఆధ్యాత్మిక గురువు. యోగానంద అమెరికాలో స్థిరపడ్డ ప్రధాన ఆధ్యాత్మిక గురువుల్లో ప్రథముడు. తన చివరి 32 సంవత్సరాలు అమెరికాలో గడిపాడు3. శ్రీయుక్తే శ్వర్ గిరికి ముఖ్య శిష్యుడిగా, యోగాభ్యాసాన్ని పాశ్చాత్యులకు పరిచయం చేసి ఆయన భౌతిక వాదాన్ని, భారతీయుల ఆధ్యాత్మికతను సమన్వయ పరచడంలో ప్రధాన పాత్ర పోషించాడు. అమెరికాలో ఆయన యోగా ఉద్యమంపై వేసిన ముద్ర, లాస్ ఏంజిలస్ లో ఆయన నెలకొల్పిన యోగా సంస్కృతి, ఆయనకు పాశ్చాత్య దేశాల్లో యోగా పితా మహుడిగా గౌరవ స్థానాన్ని సంపా దించి పెట్టాయి. 1927 లో అప్పటి అమెరికా అధ్యక్షుడు కాల్విన్ కూలిడ్జ్ చేత వైట్ హౌస్ ఆతిథ్యాన్ని అందుకున్న ప్రథమ భారతీయ ప్రముఖుడు కూడా ఆయనే. లాస్ ఏంజిలస్ టైమ్స్ అనే పత్రిక ఆయన్ను 20వ శతాబ్దపు మొట్టమొదటి సూపర్ స్టార్ గురువు అని అభివర్ణించింది. యోగానంద 1893, జనవరి 5 న ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్‌పూర్లో ఒక సాంప్రదాయ బెంగాలీ కాయస్థ కుటుంబంలో జన్మించాడు. జన్మ నామం ముకుందలాల్ ఘోష్. చిన్న వయసు నుంచే ఆధ్యాత్మికతలో వయసుకు మించిన ఆసక్తిని, పరిణతిని కనబరిచేవాడు. పాఠశాల చదువు పూర్తయిన తర్వాత ఇల్లు వదలి వారణాసిలోని మహామండల్ సన్యాసాశ్రమం చేరాడు. 17 ఏళ్ళ వయసులో, 1910 సంవత్సరంలో శ్రీయుక్తేశ్వర్ గిరిని తన గురువుగా కను గొన్నాడు. యోగానంద శ్రీయుక్తేశ్వర్ గిరి శ్రీరాంపూర్ ఆశ్రమం లోనూ, పూరీ ఆశ్రమంలోనూ ఒక దశాబ్దం పాటు (1910–1920) శిక్షణ పొందా డు. 1914 లో కలకత్తాలోని స్కాటి ష్ చర్చి కళాశాల నుండి ఇంట ర్మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణుడై 1915, జూన్ లో బి. ఎ డిగ్రీకి సమానమైన డిగ్రీని పొందాడు. కళాశాల వదిలిపెట్టిన కొన్ని వారాలకు సాంప్రదాయికంగా సన్యాసాన్ని స్వీకరించాడు. శ్రీ యుక్తేశ్వరి గిరి ఆదేశానుసారం తన సన్యాస నామాన్ని స్వచ్ఛందంగా స్వామి యోగానంద గిరిగా మార్చు కున్నాడు. 1917 లో యోగానంద బాలుర కోసం పశ్చిమ బెంగాల్ లోని దిహికలో ఒక పాఠశాల ప్రారం భించాడు. ఆ పాఠశాల అమెరికాలో యోగానంద స్థాపించిన సెల్ఫ్ రియ లైజేషన్ ఫెలోషిప్ కు భారత దేశం లో అనుబంధ పాఠశాల అయి న యోగదా సత్సంగ సొసైటీగా మారింది.అమెరికన్ యూనిటేరియన్ అసోసియేషన్ నుంచి బోస్టన్ లో జరిగే ప్రపంచ మత ఉదారవాదుల సభకు భారతదేశ ప్రతినిధిగా హాజరు కావాలని ఆహ్వానం అందింది. అందుకు గురువు శ్రీయుక్తేశ్వర్ గిరి అనుమతి కూడా వచ్చింది. 1920 లో బోస్టన్‌కు చేరుకున్న ఆయన తన ఉపన్యా సాలతో ఖండాంతర పర్యాటన చేశాడు. అంతర్జాతీయ మత సభల్లో ప్రసంగించాడు. ఆయన 1920 నుంచి 1952లో మరణించే దాకా అక్కడే ఉన్నాడు. సనాతన భారతదేశపు ఆధ్యాత్మిక బోధనలు, యోగాతత్త్వం, ధ్యాన సాంప్రదా యాలను ప్రచారం చేయడం కోసం సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ అనే సంస్థను ప్రారంభించాడు. యోగా నంద తర్వాతి నాలుగు సంవత్సరా లు బోస్టన్ లో గడిపాడు.1924 లో సందేశాలిస్తూ ఖండాంతర పర్యటన లు చేశాడు. చివరికి 1925లో లాస్ ఏంజిలస్ లో స్థిరపడ్డాడు. అమెరి కాలో ఎక్కువ భాగం గడిపిన హిందూ ఆధ్యాత్మిక గురువుల్లో యోగానంద ప్రథముడు. తర్వాత 25 సంవత్సరాల పాటు అక్కడే ప్రాంతీయంగా మంచి గుర్తింపు పొందడమే కాక తన ప్రభావాన్ని విశ్వవ్యాప్తం చేశాడు. ఒక సన్యాసి సాంప్రదాయాన్ని ఏర్పాటు చేసి శిష్య పరంపరకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. అక్కడక్కడ పర్యటిస్తూ బోధనలు చేశాడు. కాలిఫోర్నియాలోని పలు ప్రాంతాల్లో తమ సంస్థ కోసం ఆస్తు లు కొన్నాడు. వేలాది మందిని క్రియా యోగంలోకి ప్రవేశింప జేశాడు.1935లో భారత దేశానికి వచ్చిన ఆయన, మహాత్మా గాంధీని కలిసి ఆయనను క్రియాయోగంలో ప్రవేశ పెట్టాడు. ఆనందమయి మా, నిరాహార యోగిని గిరిబాల, భౌతిక శాస్త్రవేత్త సి. వి. రామన్, లాహిరీ మహాశయుల శిష్యులను కొంత మందిని కలిశాడు.తిరిగి లండన్ వెళ్లి, యోగా తరగతులు నిర్వహించాడు. చారిత్రాత్మక స్థలాలు దర్శించాడు. అక్కడ నుంచి 1936 అక్టోబరున అమెరికాకు వెళ్ళి, అమెరికన్ శిష్యులను కలుసుకుని తన బోధన లు, రచనా కార్యక్రమాలు తిరిగి కొనసాగించాడు.1952 కల్లా ఎస్ఆర్ఎఫ్ భారతదేశం లో, అమెరికాలో కలిపి 100కి పైగా కేంద్రాలు నెలకొల్పారు. ప్రస్తుతం అమెరికాలో ప్రతి ప్రధాన నగరం లోనూ కేంద్రాలున్నాయి. ఆయన బోధించిన సరళ జీవనం, ఉన్నత మైన ఆలోచన అనే విధా నం వివిధ నేపథ్యాలు కలిగిన పలు వురు జిజ్ఞాసువులను ఆకట్టుకుంది.1946 లో ఆయన రాసిన ఒక యోగి ఆత్మకథ విమర్శకుల ప్రశంసల నందుకుని ఇప్పటిదాకా 40 లక్షల ప్రతులకుపైగా అమ్ముడు పోయింది. హార్పర్ కోలిన్స్ సంస్థ 20వ శతాబ్దపు అత్యంత ప్రజాదరణ పొందిన 100 పుస్తకాల్లో ఈ పుస్తకాన్ని చేర్చింది. ఈ పుస్తకం క్రమం తప్పకుండా అనేక పునర్ముద్రణలు జరుపుకుని అనేక లక్షల మంది జీవితాలను మార్చినదిగా పరిగణించ బడుతోంది. 1946 లో ఆయన అమెరికాలో మారిన వలస చట్టాల ప్రకారం పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోగా, 1949లో అంగీకరించ బడి అధికారికంగా అమెరికా పౌరుడయ్యాడు. 1952 మార్చి 7 న యోగానంద అమెరికాలో భారత రాయబారి వినయ్ రంజన్ సేన్ గౌరవార్థం లాస్ ఏంజిలెస్ లోని బిల్ట్‌మోర్ హోటల్లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నని, తన ఉపన్యా సం ముగించి, తాను రాసిన మై ఇండియా నుంచి కొన్ని వాక్యాలు చదివాక, తన చూపును ఆజ్ఞా చక్రంపై కేంద్రీకరించాడు. వెంటనే ఆయన శరీరం నేలమీద పడి పోయింది. ఆయన అనుచరులు తమ గురువు మహాసమాధి చెందినట్లు ప్రకటించారు. 1946 లో ఆయన ఆత్మకథను ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి అనే పేరుతో ఆంగ్లంలో రాశాడు. ఈ పుస్తకం 50 పైగా భాషల్లోకి అనువాదమైంది. తెలుగులో ఒక యోగి ఆత్మకథ పేరుతో అనువదించారు. 1999 లో జరిపిన సర్వేలో ఈ పుస్తకం 20 వ శతాబ్ద పు అత్యుత్తమ ఆధ్యాత్మిక గ్రంథా ల్లో ఒకటిగా, స్థానం పొందింది. యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా (జూూ) 1917 లో యోగానంద భారత దేశంలో స్థాపించిన సంస్థ. దీన్నే 1920 లో సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్) పేరుతో అమెరికాకు విస్తరించారు. ఎస్ఆర్ఎఫ్/జూూ ప్రధాన కార్యాలయం లాస్ ఏంజిలెస్‌లో ఉంది. ఈ సంస్థకు ప్రపంచ వ్యాప్తంగా 500 కి పైగా దేవాల యాలు, కేంద్రాలు ఉన్నాయి. 175 దేశాల నుంచి ఈ సంస్థలో సభ్యులు ఉన్నారు. భారత దేశంలో జూూ 100 కి పైగా కేంద్రాలు, ఆశ్రమాలను నడుపుతోంది. నవంబరు 15, 2017 న భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, జార్ఖండ్ గవర్నరు ద్రౌపది ముర్ము, ముఖ్య మంత్రి రఘుబర్ దాస్‌తో కలిసి రాంచీలోని యోగదా సత్సంగ శాఖను సందర్శించారు. పరమహంస యోగానంద జ్ఞాపకంగా 1977 లో భారత ప్రభుత్వం ఆయన పేరున తపాలా బిళ్ళను విడుదల చేసింది. మార్చి 7, 2017 నాడు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మరో స్మారక తపాలా బిళ్ళను విడుదల చేశారు.

# వైసీపీ సభ్యులపై అసహనం వ్యక్తం చేసిన శాసనమండలి చైర్మన్

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఈ ఉదయం ప్రారంభం కాగానే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. గీతం యూనివర్సిటీకి సంబంధించి సుమారు రూ. 5 వేల కోట్ల భూ దోపిడీ జరిగిందని, దీనిపై తక్షణమే చర్చించాలని కోరుతూ వైసీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని మండలి చైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన వైసీపీ సభ్యులు ప్లకార్డులతో పోడియం వద్దకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభను అడ్డుకున్నారు.వైసీపీ ఎమ్మెల్సీల తీరుపై చైర్మన్ మోషేన్ రాజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "ప్రతిరోజూ సభను అడ్డుకోవడం మీకు అలవాటుగా మారింది" అని ఆయన ఫైర్ అయ్యారు. వాయిదా తీర్మానం ఆమోదం పొందదని ముందే తెలిసినప్పటికీ, కావాలనే నిరసనలు చేస్తూ సభా సమయాన్ని వృథా చేస్తున్నారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. అయినా సభ్యులు శాంతించకపోవడంతో, ఆ గందరగోళం మధ్యే చైర్మన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే, ప్రతిపక్ష సభ్యుల నినాదాలు హోరెత్తడంతో సభను నిర్వహించడం సాధ్యం కాక, చైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

# కొన్ని దేశాలు మధ్యవర్తిత్వానికి ప్రయత్నిస్తున్నాయి

అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత తీవ్రతరమైన ఉద్రిక్తతలను తగ్గించేందుకు "కొన్ని దేశాలు మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ప్రారంభించాయి" అని ఆయన శుక్రవారం ప్రకటించారు. ప్రాంతీయ శాంతికి తాము కట్టుబడి ఉన్నామని, అయితే ఇరాన్ ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేసిన వారికి ఈ మధ్యవర్తిత్వం సరైన సమాధానం కావాలని ఆయన 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. తమ దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

**కొనసాగుతున్న ఇరాన్ ప్రతీకారం**

అధ్యక్షుడి ప్రకటన ఒకవైపు ఉండగా.. క్షేత్రస్థాయిలో ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ తన అత్యంత శక్తివంతమైన 'ఖొర్రమ్‌షహర్-4' బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని తస్నీమ్ వార్తా సంస్థ వెల్లడించింది. "ఆపరేషన్ ట్రూ ప్రామిస్-4"లో భాగంగా 22వ విడత దాడులు మొదలయ్యాయని, ఇవి నేరుగా ఇజ్రాయెల్ భూభాగంపై విరుచుకుపడుతున్నాయని ఇస్లామిక్ రెవల్యూషన్ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) తెలిపింది. మరోవైపు, లెబనాన్‌లోని సిడాన్ నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఓ నివాస భవనం దెబ్బతిన్నట్లు జిన్హువా వార్తా సంస్థ నివేదించింది.

**విరుచుకుపడుతున్న అమెరికా 'ఎపిక్ ఫ్యూరీ'**

మరోవైపు, ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని మరింత ఉధృతం చేస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. ఫ్లోరిడాలోని టాంపాలో ఉన్న సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ నావికాదళాన్ని, క్షిపణి కేంద్రాలను తమ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయని తెలిపారు. "మేము ఈ పోరాటానికి సిద్ధంగా ఉన్నాం, విజయం సాధించే దిశగా వెళ్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

**ఇరాన్‌కు భారీ నష్టం: అమెరికా ప్రకటన**

ఈ ఆపరేషన్ ఆరో రోజుకు చేరుకుందని, ఇరాన్ మిలటరీ సామర్థ్యం గణనీయంగా తగ్గిందని అమెరికా సెంట్రల్ కమాండ్ చీఫ్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ వెల్లడించారు.

గత 72 గంటల్లో టెహ్రాన్ పరిసరాల్లోని దాదాపు 200 లక్ష్యాలపై అమెరికా బాంబర్లు దాడులు చేశాయి.

భూగర్భంలో దాచిన క్షిపణి లాంచర్లను ధ్వంసం చేసేందుకు బీ-2 బాంబర్ల ద్వారా 2000 పౌండ్ల బాంబులను జారవిడిచారు.

ఇప్పటివరకు 30కి పైగా ఇరాన్ నౌకలను సముద్రంలో ముంచేశారు.

ఇందులో రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ పరిమాణంలో ఉన్న ఓ భారీ డ్రోన్ క్యారియర్ షిప్ కూడా ఉందని, అది ప్రస్తుతం మండుతోందని కూపర్ తెలిపారు.

అమెరికా దాడుల ఫలితంగా ఇరాన్ నుంచి వచ్చే బాలిస్టిక్ క్షిపణి దాడులు 90 శాతం, డ్రోన్ దాడులు 83 శాతం తగ్గుముఖం పట్టాయని ఆయన వివరించారు.

ఇరాన్ స్పేస్ కమాండ్‌కు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా దెబ్బతీశామన్నారు.

కేవలం ఇరాన్ దగ్గర ఉన్న ఆయుధాలను ధ్వంసం చేయడమే కాకుండా.. భవిష్యత్తులో వారు తిరిగి కోలుకోలేనంతగా క్షిపణి తయారీ పరిశ్రమను నేలమట్టం చేయడమే తమ తదుపరి లక్ష్యమని అమెరికా స్పష్టం చేసింది.

# సీఎం, డిప్యూటీ సీఎం వంటి స్థానాల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా ఉండాలి

- మొదటి పేజి తరువాయి

రాజకీయ లబ్ధి కోసం దేవుడిని, ఆలయాల ప్రతిష్ఠను వాడుకోవడం తగదని హితవు పలికారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వస్తున్న ఆరోపణలు అసత్యమని, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు.రాజకీయం చేయడానికి వేరే అంశాలు లేకనే దేవుడిని, ఆలయాలను వివాదాల్లోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల, శ్రీశైలం, అన్నవరం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల ప్రతిష్ఠను కూటమి నేతలు దిగజార్చుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, హోం మంత్రి వంటి ఉన్నత స్థానాల్లో ఉన్న వారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని హితవు పలికారు. శాసనమండలి చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తి కులం, మతం గురించి మాట్లాడటం అత్యంత విచారకరమని వ్యాఖ్యానించారు.తిరుమల లడ్డూ వ్యవహారంలో తమ వైపు తప్పు లేదని ప్రభుత్వం భావిస్తే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని ఎద్దేవా చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు అసత్య ప్రచారాలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

# ఇకపై పొరపాట్లు జరగవు.. గతం గతః

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో గత కొంతకాలంగా టీడీపీలో సాగుతున్న రాజకీయ వివాదాలకు తెరపడినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని చిన్ని మధ్య నెలకొన్న విభేదాల నేపథ్యంలో, ఈరోజు అసెంబ్లీ లాబీల్లో ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుని కొలికపూడి కలిశారు. నియోజకవర్గంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు, పార్టీ ప్రతిష్ఠపై పడుతున్న ప్రభావంపై వీరు చర్చించారు. అనంతరం మీడియాతో పల్లా మాట్లాడుతూ కొలికపూడికి తాను చెప్పాల్సింది చెప్పానని అన్నారు.

అనంతరం కొలికపూడి మాట్లాడుతూ... గతంలో జరిగిన పొరపాట్లు ఇకపై పునరావృతం కావని, 'గతం గతః' అని ఆయన స్పష్టం చేశారు. తన చర్యల వల్ల పార్టీకి ఇబ్బంది కలిగినందుకు విచారం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో నియోజకవర్గ ఎంపీకి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తానని, ఆయన నుంచి కూడా అదే ఆశిస్తానని తెలిపారు. అలాగే, తన చుట్టూ ఉన్న కొందరు వ్యక్తుల వల్ల లేదా ఎంపీ అనుచరులు కొందరి వల్ల ఈ సమస్యలు తలెత్తి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.రాజకీయ ప్రయోజనాల కోసం కులం కార్డును వాడటం తన అభిమతం కాదని, ఆ విధానానికి తాను పూర్తిగా వ్యతిరేకమని కొలికపూడి స్పష్టం చేశారు. ఇకపై నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా నేరుగా జోనల్ కోఆర్డినేటర్ లేదా జిల్లా పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటానని హామీ ఇచ్చారు.

# బొత్సకు మళ్లీ అస్వస్థత...

వైసీపీ సీనియర్ నేత, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. శాసనమండలిలో జరుగుతున్న చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతుండగా అస్వస్థతకు లోనయ్యారు. సభలో ప్రసంగిస్తున్న సమయంలో బొత్స తీవ్రంగా ఇబ్బంది పడటాన్ని గమనించిన మంత్రి పయ్యావుల కేశవ్ వెంటనే స్పందించారు.

బొత్స ఇబ్బందిని గుర్తించిన మంత్రి పయ్యావుల.. ప్రసంగాన్ని కాసేపు నిలిపివేసి, కూర్చుని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ అధికారులు వెంటనే వైద్యులను మండలికి పిలిపించారు. అక్కడికి చేరుకున్న వైద్య బృందం అసెంబ్లీ ఆవరణలోని డిస్పెన్సరీలో బొత్సకు పలు రకాల పరీక్షలు నిర్వహించింది. రక్తపోటు (బీపీ)లో హెచ్చుతగ్గుల కారణంగానే బొత్స అస్వస్థతకు గురయ్యారని డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు విశ్రాంతి చాలా అవసరమని వైద్యులు స్పష్టం చేశారు.అస్వస్థత నేపథ్యంలో అసెంబ్లీ వైద్యులు.. బొత్సకు రెగ్యులర్ గా చికిత్స అందించే స్పెషలిస్ట్ డాక్టర్లతోనూ మాట్లాడారు. ప్రస్తుతం బొత్స ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. అయితే ముందస్తు జాగ్రత్తగా, మెరుగైన వైద్య చికిత్స కోసం బొత్సను హైదరాబాద్ కు తరలించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇటీవలే బొత్స అనారోగ్య సమస్యలతో హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే.

# నేడు ఢిల్లీలో 110 దేశాల ప్రతినిధులతో సదస్సు...

- మొదటి పేజి తరువాయి

'రైసినా డైలాగ్'కు గొప్ప పేరుంది. 2016 నుంచి ఏటా నిర్వహిస్తున్న ఈ సదస్సు.. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన 'మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్' తరహాలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈసారి జరుగుతున్న 11వ ఎడిషన్ సదస్సులో దాదాపు 110 దేశాలకు చెందిన 2,700 మంది ప్రతినిధులు పాల్గొంటుండటం విశేషం. వివిధ దేశాల అధినేతలు, మంత్రులు, అత్యున్నత సైనిక అధికారులు, విధానకర్తలు, మేధావులు ఒకే వేదికపై గ్లోబల్ వ్యూహాలను చర్చించనున్నారు. ఈ ఏడాది ఈ సదస్సును సంస్కార, అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే ఆసక్తికరమైన థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ ఈ సదస్సులో ప్రధాన ఉపన్యాసం చేయనున్నారు.

**సీఎం పర్యటన వివరాలు**

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు రేపు (మార్చి 7) ఉదయం 10.50 గంటలకు విజయవాడ నుంచి విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ వేదికగా జరిగే 'రైసినా డైలాగ్ 2026' సెషన్‌లో పాల్గొంటారు. సదస్సు ముగిసిన అనంతరం ఆయన తిరిగి అమరావతికి పయనమవుతారు.

**ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా ప్రసంగం**

దేశంలోనే అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఏపీలో అమలు చేస్తున్న సుపరిపాలన, డిజిటల్ విప్లవం గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో సవివరంగా చెప్పనున్నారు. ప్రధానంగా రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత నిర్ణయాల ద్వారా సామాన్య ప్రజలకు పౌరసేవలను ఎంత వేగంగా, పారదర్శకంగా అందిస్తున్నారో వివరించనున్నారు. పాలనకు సాంకేతికతను జోడించి ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, సంపద సృష్టి, 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' వంటి అంశాలపై తన సుదీర్ఘ అనుభవాలను అంతర్జాతీయ ప్రతినిధులతో పంచుకోనున్నారు.

అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ ఆవిష్కరణల కేంద్రంగా, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న దార్శనిక నిర్ణయాలను ప్రపంచ దేశాల ముందు ఉంచనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎకోసిస్టమ్, భారీ డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీ కారిడార్ల ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం వివరించనున్నారు. పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీని మార్చేందుకు చేస్తున్న కృషిని, భవిష్యత్ ప్రణాళికలను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియజేయనున్నారు.

# విపక్షం లేకున్నా ఐదు కోట్ల ప్రజల కోసమే చర్చలు

- మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకానికి జీవం పోశామని, ఇంటింటికీ కుళాయి ద్వారా నీరందించేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీసుకుంటున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# లొంగిపోవడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదు

ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం జరగాలన్నా, ఆ దేశం బేషరతుగా లొంగిపోవడం మినహా మరో మార్గం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్ చేశారు. "ఇరాన్ బేషరతుగా లొంగిపోవాలి! ఆ తర్వాత అక్కడ గొప్ప, ఆమోదయోగ్యమైన నాయకత్వం రావాలి. అప్పుడే మేము, మా మిత్రదేశాలు కలిసి ఇరాన్‌ను వినాశనం అంచుల నుంచి బయటకు తీసుకొస్తాం. ఇరాన్‌ను ఆర్థికంగా మునుపటి కంటే బలంగా తీర్చిదిద్దుతాం. ఇరాన్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా తన ఎన్నికల నినాదాన్ని గుర్తుచేస్తూ.. "మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్" అంటూ కొత్త నినాదాన్ని వినిపించారు.మరోవైపు అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. క్షిపణి దాడులు, నావికాదళ దాడులతో మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. ఇజ్రాయెల్ లెబనాన్‌లోని హిజ్బుల్లా లక్ష్యాలపై దాడులు విస్తృతం చేయగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడుతోంది. కొన్ని రోజుల కిందట హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా సబ్‌మెరైన్ దాడి చేసి ముంచేయడం ఉద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు ఇరాన్‌లో వెయ్యి మందికి పైగా మరణించగా, ఇజ్రాయెల్, లెబనాన్‌లలో డజన్ల కొద్దీ ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురుస్తుండటంతో వేలాది మంది రాజధానిని వదిలి పారిపోతున్నట్లు ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా, ట్రంప్ యుద్ధ అధికారాలను నియంత్రించేందుకు చేసిన ప్రయత్నాలను వాషింగ్టన్‌లో సెనేట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. ప్రస్తుతానికి అమెరికా బలగాలు నేరుగా రంగంలోకి దిగకపోయినా, భవిష్యత్తులో ఆ అవకాశాన్ని వైట్‌హౌస్ కొట్టిపారేయలేదు. ఈ యుద్ధం ప్రభావం ప్రపంచ వాణిజ్యం, ఇంధన సరఫరాలపై తీవ్రంగా పడుతోంది. హార్ముజ్ జలసంధిలో దాడుల భయంతో నౌకల రాకపోకలు తగ్గిపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్లకు చేరాయి. భద్రతా కారణాల దృష్ట్యా పలు షిప్పింగ్ సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి.

# అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో వందలాది చిన్నారులు మృతి

- మొదటి పేజి తరువాయి

విద్య, సంక్షేమం కోసం పనిచేసే ఈ ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ ఆవేదన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త ఆపరేషన్‌లో మొదటి రోజు ఇరాన్‌లోని మినాబ్‌లో ఒక బాలికల పాఠశాలపై దాడి జరగగా, 160 మంది చిన్నారులు మృతి చెందినట్లు ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది.

# ఈ నెలాఖరు నాటికి నక్సలిజం పీడ విరగడవుతుంది

- మొదటి పేజి తరువాయి

57వ రైజింగ్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ మార్చి నెలాఖరు నాటికి భారతదేశం మావోయిజం నుంచి పూర్తి విముక్తి పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలోనే నిర్ణయించుకున్న లక్ష్యం ప్రకారం, దేశాన్ని నక్సలిజం రహితంగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుందని ఆయన వివరించారు. ముఖ్యంగా ఒకప్పుడు మావోయిస్టులు కలలుగన్న 'తిరుపతి నుంచి పశుపతి' వరకు రెడ్ కారిడార్‌ను నిర్మించాలనే కలలను భద్రతా దళాలు పూర్తిగా నాశనం చేశాయని కొనియాడారు.నక్సలిజం పీడను వదిలించడంలో సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్ల అసాధారణ కృషిని అమిత్ షా ప్రశంసించారు. భద్రతా దళాల పటిష్ట వ్యూహాల వల్ల నక్సల్స్ ప్రభావం ఇప్పుడు చాలా తక్కువ ప్రాంతాలకు, అది కూడా కొన్ని మారుమూల ప్రాంతాలకే పరిమితమైందని పేర్కొన్నారు. అభివృద్ధికి అడ్డుపడుతూ, పాఠశాలలు, ఆసుపత్రులను ధ్వంసం చేసే మావోయిస్టుల పట్ల ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని ఆయన హెచ్చరించారు. ఆయుధాలు పట్టి అమాయకులను పొట్టనబెట్టుకునే వారికి ఆయుధాలతోనే సమాధానం చెబుతామని హోం మంత్రి కఠిన హెచ్చరికలు జారీ చేశారు.మావోయిజం వల్ల దశాబ్దాలుగా వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి పరుగులు తీస్తోందని అమిత్ షా వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వంటి మారుమూల ప్రాంతాల్లో ఇప్పుడు రోడ్లు, విద్యుత్, మొబైల్ కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలు వేగంగా అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు హింసకు నిలయంగా ఉన్న ఆ ప్రాంతాలు ఇప్పుడు అభివృద్ధికి చిహ్నాలుగా మారుతున్నాయని, గిరిజన బిడ్డలకు ఉపాధి, విద్యావకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

# విజ్ఞానం మరియు సాంకేతికత సమాజ అభివృద్ధికి కీలకం

- విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథంతో ముందుకు సాగాలి.
- విశ్వవిద్యాలయాలు పరిశోధన మరియు సాంకేతికతను ప్రోత్సహించే వేదికలుగా నిలవాలి.




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయనగరం. మార్చి 06:**కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు మరియు టెక్ ఫెస్ట్2కే26 కార్యక్రమం ఘనంగా ముగిసింది. విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అకడమిక్ కార్యక్రమాలు, వర్క్‌షాపులు, సెమినార్లు, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాల గురించి ముందుగా కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బొంతు కోటయ్య వివరించారు. విజ్ఞానం మరియు సాంకేతికత సమాజ అభివృద్ధికి కీలకమని డా. శివాజీ చంద్రం, బారత ప్రభుత్వ మాజీ డైరెక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డిఎస్టి) పేర్కొన్నారు. విద్యార్థులు పరిశోధనాత్మక దృక్పథంతో ముందుకు సాగాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు పరిశోధన మరియు సాంకేతికతను ప్రోత్సహించే వేదికలుగా నిలవాలని శివాజీ చంద్రం అన్నారు. పరిశ్రమలు మరియు విద్యాసంస్థల మధ్య సహకారం అత్యంత అవసరమని బైనోవిజన్ సంస్థ ప్రధాన కార్య నిర్వాహణాధికారి గణేష్ నాగ్ దొడ్డి పెర్కొన్నారు. విద్యార్థులు తమ విద్యా కాలంలోనే ప్రాక్టికల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. టెక్నాలజీ రంగంలో నిరంతరం అభ్యాసం మరియు నవీనత ఎంతో ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయంలో అకడమిక్ మరియు పరిశోధన కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి ఇటువంటి జాతీయ



సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా తెలిపారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి సమాజ అభివృద్ధికి దోహదపడేలా కృషి చేయాలని సూచించారు. జాతీయ సదస్సులు విద్యార్థులు మరియు పరిశోధకులకు కొత్త ఆలోచనలు, పరిశోధన అవకాశాలను అందిస్తాయనివిశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ తెలిపారు. కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయం విద్యా, పరిశోధన మరియు సాంకేతిక రంగాల్లో మరింత ముందుకు సాగేందుకు కృషి చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోస్టర్ ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, హ్యాకథాన్, డీబగ్గింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేపర్ ప్రజెంటర్లు మరియు ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బొంతు కోటయ్య సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అతిథి అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా


# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్ ఇద్దరికీ గాయాలు

**గూడెంకొత్తవీధి/చింతపల్లి,పెన్ పవర్,మార్చి 6**:మండలంలో జాతీయ రహదారి516పై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు.వివరాల ప్రకారం, దామనపల్లి బ్రాంచ్ పోస్టాఫీస్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ మాస్టర్‌గా పనిచేస్తున్న ఉష తన సహోద్యోగి లోకేష్‌తో కలిసి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై చింతపల్లి వైపు వెళ్తున్నారు.ఈ సమయంలో అంతర్ల శివాలయం సమీపంలో ప్రమాదం జరిగింది.చింతపల్లి నుండి రింతాడ వైపుకు వేగంగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనంపై ప్రయాణిస్తున్న ఉష, లోకేష్ ఇద్దరూ కింద పడిపోయి గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన వారిని చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం వారికి అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ప్రమాదానికి ట్రాక్టర్ అధిక వేగమే కారణమని స్థానికులు చెబుతున్నారు. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



# కండ్ల కలకను నిర్లక్ష్యం చేయొద్దు డాక్టర్ కె.త్రినాధరావు, నేత్రవైద్య నిపుణులు





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 06 :**
కండ్ల కలకను నిర్లక్ష్యం చేయవద్దని, జిల్లా సర్వజన ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ కె.త్రినాధరావు సూచించారు.
కండ్ల కలక, ఇతర కంటి వ్యాధులు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.
ఇటీవల కొన్ని జిల్లాల్లో కండ్ల కలక విజృంభిస్తున్న కారణంగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు సూచనలు చేశారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

కంటి ఎర్రబారడం, దురద లేదా నీరు కారడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా కంటి వైద్యుడిని సంప్రదించాలని కోరారు. సరైన సమయంలో చికిత్స తీసుకుంటే వ్యాధి త్వరగా తగ్గిపోతుందనీ మరియు ఇతరులకు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చునని సూచించారు. కంటి ఆరోగ్యం మన ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని, పరిశుభ్రత పాటించి కంటి వ్యాధులను దూరంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

**సీజనల్ కంటి వ్యాధులు**

ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా ప్రజల్లో సీజనల్ కంటి వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కంజంక్టివిటిస్ (మీుఎతీుం జుఎవ) వంటి వైరల్ కంటి ఇన్ఫెక్షన్లు ఈ కాలంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ఈ వ్యాధి చిన్నపిల్లలు, విద్యార్థులు మరియు గుంపులుగా ఉండే ప్రాంతాల్లో త్వరగా వ్యాపించే అవకాశం ఉంది. అందువల్ల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం అత్యంత అవసరం.

**సీజనల్ కంటి వ్యాధులు రావడానికి గల కారణాలు**

సీజన్ మార్పులు, ధూళి, కాలుష్యం, వైరల్ మరియు బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు ప్రధాన కారణాలు. పరిశుభ్రత లోపం, మురికిగా ఉన్న చేతులతో కంటిని తాకడం, వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోవడం వంటి అలవాట్లు కూడా ఈ వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయి.

**కండ్ల కలక ప్రధాన లక్షణాలు**

కంటి ఎర్రబారడం, కంటిలో దురద లేదా మంట, నీరు కారడం, కంటి చుట్టూ వాపు, వెలుతురు చూసేటప్పుడు ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

**వ్యాధి వ్యాప్తి చెందే విధానం**

ఈ కంటి వ్యాధులు ముఖ్యంగా వైరస్ ద్వారా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి సులభంగా వ్యాప్తి చెందుతాయి. ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తి ఉపయోగించిన తువాలు, రుమాలు, దిండు కవర్లు లేదా ఇతర వస్తువులు ఉపయోగించినప్పుడు కూడా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పాఠశాలలు, హాస్టల్స్, కార్యాలయాలు వంటి గుంపులలో వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది.

**తీసుకోవలసిన జాగ్రత్తలు**

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. చేతులను తరచుగా సబ్బుతో కడుక్కోవాలి. కంటిని చేతులతో రుద్దకూడదు. వ్యక్తిగత తువాలు, రుమాలు వేరుగా ఉపయోగించాలి. బయటకు వెళ్లేటప్పుడు ధూళి నుండి రక్షణ కోసం కళ్లద్దాలు ధరించడం మంచిది. కంటి సమస్యలు ఉన్నప్పుడు డాక్టర్ సూచించిన మందులు మాత్రమే వాడాలి.

# రారండోయ్ మన గ్రామ దేవత జాతర జరుపుకుందాం..!



- మే 3.4.5 హుకుంపేట మొదకొండమ్మ జాతర మహోత్సవం.
- హుకుంపేట శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ జాతర మహోత్సవం జరుపుటకు తేదీలు ఖరారు చేసిన ఉత్సవ కమిటీ.


**హుకుంపేట పెన్ పవర్ మార్చి 6 :** అల్లూరి సీతారామ జిల్లా హుకుంపేట మండలం మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ మొదకొండమ్మ అమ్మ జాతర మహోత్సవాన్ని
మే నెల 3.4.5. తేదీల్లో నిర్వహించడానికి హుకుంపేట స్థానిక సర్పంచ్ సమ్మెడ వెంకట పూర్ణిమ ఆధ్వర్యంలో. గ్రామ పెద్దలు నిర్ణయించారు. ప్రతి సంవత్సరం లాగా ఇది ఏడాది కూడా అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు.
అలాగే ఉత్సవ కమిటీను ఎన్నుకున్నారు అధ్యక్షులు కోర్ర నాగబాబు ఉపాధ్యక్షులు శోభ సంతోష్ కుమార్ ప్రధాన కార్యదర్శి , వొలుగు వాసుదేవ్ కోశాధికారి, సిరగం సూర్యకాంతం , నైని సత్తిబాబు కార్యదర్శులు , మజ్జి రామకృష్ణ, వంతాల రామయ్య
వండాలి విశ్వనాథం గౌరవ అధ్యక్షురాలు , సమీడ వెంకట పూర్ణిమ సర్పంచ్
కొామ రమ ఎంపిటిసి గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.విద్యుత్ అలంకరణతో పలు సాంస్కృతి కార్యక్రమాలతో ఈ ఏడాది జాతరను అంగరంగ వైభవంగా జరపాలని గ్రామస్తులు ఉత్సవ కమిటీ నిర్ణయించారు.
కావున గ్రామ పెద్దలు ఉద్యోగస్తులు వ్యాపారులు యూత్ కుర్రోలు అందరూ హుకుంపేట జాతర మహోత్సవానికి సహకరించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు పిలుపునిచ్చారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 15లోగా సి.ఎస్.సి పనులను పూర్తి చేయాలి

**..జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి**

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 06:** జిల్లాలోని కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (జూజ) పనులను లక్ష్య కాలపరిమితిలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయం నుండి ఆర్.డబ్ల్యూ.ఎస్ ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన ప్రతి సి.ఎస్.సి పని పూర్తి కావడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఇంజనీరు తాము సాధించిన రోజువారీ ప్రగతిని వివరించాలని, దీనిని ఒక సవాలుగా తీసుకోవాలని సూచించారు. మార్చి 15వ తేదీ నాటికి ఏ ఒక్క పని కూడా పెండింగ్‌లో ఉండకూడదని ఆయన గడువు విధించారు. ఒక పని జరుగుతున్నప్పుడు మిగిలిన పనులను నిలిపివేయడం సరికాదని, అన్ని పనులు సమాంతరంగా సాగాలని కలెక్టర్ ఉద్బోధించారు. పనుల నిర్వహణలో ప్రతి అధికారికి ఒక స్పష్టమైన ప్రణాళిక,వ్యూహం ఉండాలని, లక్ష్య సాధన పట్ల తపన చూపాలని అన్నారు. మంజూరైన ప్రతి పని తక్షణమే ప్రారంభం కావాలని, గ్రౌండింగ్ కాని పనులు ఏవీ ఉండకూడదని స్పష్టం చేశారు. పనులు ప్రారంభించినట్లుగా ఆధారంగా ఫోటోలు పంపాలని ఆదేశించారు. నిర్మాణాలకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయని, నిధుల సాకుతో పనులను ఆపవద్దని తేల్చిచెప్పారు. ముఖ్యంగా ఐటీడీఏ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం తప్పనిసరిగా అవసరం ఉంటుందని, అందుకు తగినట్లుగా నిర్మాణాలు జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా స్థలాభావం ఉంటే తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జల జీవన్ మిషన్, సి.ఎస్.సి పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే ప్రారంభం కావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఏ.విజయశాంతి, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యాన పంటలను సాగుచేయాలి

- రైతులకు జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి పిలుపు.
- భోగాపురంలో పర్యటించి పంటల పరిశీలన



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విజయనగరం. మార్చి 06 :** అత్యధిక లాభాలను ఇచ్చే ఉద్యాన పంటలను సాగు చేయాలని జిల్లా రైతాంగానికి కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. భోగాపురం మండలంలో శుక్రవారం కలెక్టర్ పర్యటించారు. కొయ్యపేటలో రైతులు సాగుచేస్తున్న ఉద్యాన పంటలను పరిశీలించారు. పొలాల్లో దిగి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సాగు చేస్తున్న పద్ధతులు, మార్కెట్ సదుపాయం తదితర అంశాలను ఆరా తీశారు. వరి స్థానంలో అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటలవైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పళ్లు, పూల సాగు ద్వారా నిరంతరం ఆదాయాన్ని పొందవచ్చునని సూచించారు. ఉద్యాన సాగు వైపు మళ్లే రైతులకు జిల్లా యంత్రాంగం అన్నివిధాలా సహకారాన్ని, ప్రోత్సాహాన్ని ఇస్తుందని హామీ ఇచ్చారు. అలాగే వారు పండించే పంటలకు మార్కెట్ సదుపాయాన్న, సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిస్తామని అన్నారు. అత్యధిక దిగుబడి కోసం సంప్రదాయ సాగు పద్ధతులు బదులు ఆధునిక విధానాలను అవలంభించాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో ఉద్యానశాఖ డిడి చిట్టిబాబు, వ్యవసాయశాఖ ఎడి నాగభూషణరావు, మండల వ్యవసాయాధికారి హైమావతి, ఉద్యాన అధికారి ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర ఏ 2047 క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

- ప్రగతిబాటలో మన్యం జిల్లా ఉందని కితాబు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, పార్వతీపురం. మార్చి 06** : రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన స్వర్ణాంధ్రఏ2047 క్యాలెండర్లను జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, జేసీ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లా అధికారులు చొరవ, సహకారంతో మన్యం జిల్లా ముందంజలో ఉందని కితాబిచ్చారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం పేదరిక నిర్మూలన, ఉపాధి ఉద్యోగ కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, వ్యవసాయంలో సాంకేతికత, ప్రపంచ స్థాయి రవాణా, స్వచ్ఛ ఆంధ్ర, అని దశల్లో సమగ్ర సాంకేతికత మొదలైన 10 సూత్రాలతో విజన్ డాక్యుమెంట్ ను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని కలెక్టర్ తెలిపారు. ఈ పది సూత్రాల ప్రాధాన్యతను వివరిస్తూ "స్వర్ణాంధ్రఏ2047" అంశంతో రూపొందించిన 2026 సంవత్సరం క్యాలెండర్లను జిల్లా స్థాయి కార్యాలయాలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు పంపిణీ చేయాలని సమాచార శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.బాలమన్ సింగ్, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ, డీపీఓ టి.కొండలరావు, డ్వామా పీడీ కె. రామచంద్రరావు, డీఎంహెచ్ఓ డా. ఎస్.భాస్కరరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీహెచ్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

- కేక్ కట్ చేసి ప్రారంభించిన డిప్యూటీ సూపరిండెంట్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 06 :** విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయి స్ అసోసియేషన్ మహిళా విభాగం, నర్సింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేజీహెచ్ డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ నాయు డు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహి ళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో పనిచేసే నర్సింగ్ సిబ్బంది ఆరో గ్యంగా ఉండడం ఎంతో అవసరమని పేర్కొన్నా రు. రోగులకు సేవలందించే విషయంలో నర్సింగ్ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ వైద్య రం గంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్2 నర్సిం గ్ సూపరింటెండెంట్లు అమ్మనమ్మ, ఓపీఎల్ కుమారి, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి. రాజశేఖర్ రెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు జైతు రవీంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు, సీనియర్ హెడ్ నర్స్ వి. ఉషా రాణి, డి. లక్ష్మి, ట్రెజరర్ సందీప్తి, యూనియన్ వైస్ ప్రెసిడెంట్లు పవన్ కుమార్, శాంతి స్వరూప్, ఐ. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు స్టాఫ్ నర్సులు, సిబ్బంది ఉత్సాహంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఏప్రిల్ నాటికి వంశధార ఎత్తిపోతల పూర్తి ..





- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 06:** గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి, రానున్న ఏప్రిల్ నాటికి పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన హీరమండలం మండలంలో పర్యటించి, జలాశయానికి నీటిని తరలించే ఎత్తిపోతల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పథకానికి సంబంధించిన విద్యుత్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, జలాశయం భవిష్యత్తులో జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతేకాకుండా, హీరమండలం జలాశయ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆయన వెల్లడించారు. జలాశయం ద్వారా ఉద్దాన ప్రాంతంతో పాటు పలు నియోజకవర్గాలకు శాశ్వత మంచినీటి పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ధీమా వ్యక్తం చేశారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు మంచినీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాలకు సాగు, మంచినీటి లభ్యత పెరుగుతుందని వివరించారు. ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# జీవవైవిధ్య పరిరక్షణ మన బాధ్యత







- ఎకో క్లబ్ లు బలోపేతంగా పని చేయాలి
- మట్టి పాత్రలో జీవులకు నీరు ఏర్పాటు చేయాలి
- రేపటి పౌరులు పర్యావరణ హితంగా జీవించాలి
- పి. నీలకంఠ, ఎపి స్టేట్ కోఆర్డినేటర్, నేషనల్ గ్రీన్ కార్ప్స్

**విశాఖ మార్చ్ 6 (పెన్ పవర్)**జీవవైవిధ్య పరిరక్షణ మన బాధ్యత అని నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎపి స్టేట్ కోఆర్డినేటర్ పి. నీలకంఠ పిలుపునిచ్చారు. ఏలూరు ఎస్ వి ఎస్ విడి మున్సిపల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం ఎన్ జి సి ప్రాంతీయ కార్యశాల నిర్వహించారు. ఇందులో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ధాన్యం కంకులు కుచ్చులు, తోరణాలు తయారీ శిక్షణ ఇచ్చారు, అలాగే గోడ పత్రిక తొ ప్రదర్శన నిర్వహించారు. అలాగే చింతలపూడి ఉన్నత పాఠశాల హెచ్ ఎం భారతి, విద్యార్థులు తయారు చేసిన క్రాఫ్ట్ వర్కులు ఎగ్జిబిషన్ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎకో క్లబ్ లు బలోపేతంగా పని చేయాలి అని కోరారు. ఈ వేసవిలో పక్షులు, ఇతర మూగ జీవాల కోసం మట్టి పాత్రలో నీరు ఏర్పాటు చేయాలి అని కోరారు. రేపటి పౌరులు పర్యావరణ హితంగా జీవించే విధంగా శిక్షణ ఇవ్వాలి అని కోరారు. ప్రతి పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ ముద్రించిన ఎన్విరాన్మెంటల్ కాలమానిని ప్రతి ఎన్ జి సి గ్రీన్ టీచర్ సద్వినియోగం చేసుకోవాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరం అని వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు, హెచ్ ఎం కుటుంబ రావు, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు విభిన్న అంశాల గురించి వివరించారు.

# గరివిడి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం.




**గరివిడి పెన్ పవర్ మార్చి 06.** గరివిడి పోలీస్ స్టేషన్ పరిధిలో గల శ్రీ గోదావరి సర్ఫ్ హై స్కూల్ విద్యార్థినులకు మహిళా సాధికారత వారోత్సవాలలో భాగంగాచీపురుపల్లి డి.ఎస్.పి రాఘవులు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇందులో భాగంగా విద్యార్థినులకు మహిళల యొక్క భద్రత మహిళపై జరిగే నేరాలు వాటి నివారణ చర్యలు మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పనితీరుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమకున్న సందేహాలను పోలీసు వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి సిఐ శంకర్రావు గరివిడి ఎస్సై లోకేశ్వరరావు పాల్గొన్నారు.


# కేజీహెచ్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

- కేక్ కట్ చేసి ప్రారంభించిన డిప్యూటీ సూపరిండెంట్





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 06 :** విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయి స్ అసోసియేషన్ మహిళా విభాగం, నర్సింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేజీహెచ్ డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ నాయు డు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహి ళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో పనిచేసే నర్సింగ్ సిబ్బంది ఆరో గ్యంగా ఉండడం ఎంతో అవసరమని పేర్కొన్నా రు. రోగులకు సేవలందించే విషయంలో నర్సింగ్ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ వైద్య రం గంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్2 నర్సిం గ్ సూపరింటెండెంట్లు అమ్మనమ్మ, ఓపీఎల్ కుమారి, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డి. రాజశేఖర్ రెడ్డి, నగర శాఖ అధ్యక్షుడు జైతు రవీంద్రనాథ్, ఉపాధ్యక్షురాలు, సీనియర్ హెడ్ నర్స్ వి. ఉషా రాణి, డి. లక్ష్మి, ట్రెజరర్ సందీప్తి, యూనియన్ వైస్ ప్రెసిడెంట్లు పవన్ కుమార్, శాంతి స్వరూప్, ఐ. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు స్టాఫ్ నర్సులు, సిబ్బంది ఉత్సాహంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# మహిళా దినోత్సవం వేడుకలకు నాంది





- కలెక్టరేట్‌లో మహిళా క్రీడా పోటీలు ప్రారంభం
- మహిళా సాధికారత కార్యరూపంలోకి రావాలి
- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 06 :** మహిళలే సమాజ ప్రగతికి ప్రధాన శక్తి అని, మ హిళా సాధికారత మాటల్లోనే కాకుండా కార్య రూపంలో అమలైనప్పుడే దానికి నిజమైన అర్థం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. మార్చి 8న జరగనున్న అంత ర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్ర వారం కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా అధికారు లు, సిబ్బందికి ప్రత్యేకంగా నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి కలిసి బెలూన్లు ఎగుర వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ బా ధ్యతలను నిర్వహించడమే కాకుండా కార్యాల య బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వ హిస్తున్న మహిళల సేవలు ప్రశంసనీయమని అన్నారు. మహిళా సాధికారత సాధనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ప్రపంచవ్యాప్తంగా సునీతా విలియమ్స్, కల్పనా చావ్లా, పీవీ సింధు వంటి మహిళలు సాధించిన విజయాలు కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తు న్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి మహిళ తన లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిం చారు. క్రీడలు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడల ద్వారా జట్టు భావన, క్రమశి క్షణ, పోటీ స్ఫూర్తి వంటి విలువలు పెంపొం దుతాయని, ఇవి వృత్తి జీవితంలో కూడా ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ పోటీల్లో కనిపించిన ఉత్సాహాన్ని ప్రతి ఒక్కరూ దీర్ఘకాలం కొనసాగించాలని సూచించారు. కలెక్టరేట్ ప్రాంగ ణంలో జరిగిన ఈ క్రీడా పోటీల్లో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డిప్యూటీ కలెక్టర్లు శేషశైలజ, అనిత, రామలక్ష్మి, మాధవి, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, వివిధ విభాగాల సూపరింటెం డెంట్లు, మహిళా అధికారులు, సిబ్బంది ఉత్సా హంగా పాల్గొన్నారు. కార్యక్రమం ఆనందోత్సా హాల మధ్య సాగింది.




# కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఘనంగా దేవేరుల కళ్యాణోత్సవాల ముగింపు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 06 :**నగరంలోని కురుపాం మార్కెట్ ప్రాంతంలో ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వ హించిన నగరేశ్వరస్వామివింధ్యావాసిని, జనార్ధనస్వామికోనకమలాదేవి దేవేరుల కళ్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. గత నెల 27వ తేదీన ప్రారంభమైన ఈ వేడుకలు వారం రోజుల పాటు భక్తి పారవశ్యంతో కొనసాగాయి.

చివరి రోజు బుధవారం ఉదయం అవపోసన, బలిహరణ, ఈశ్వరాభిషేకం, సహస్రనామార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం నిర్వహించిన పుష్పయా గం, పండితుల సత్కారం, దేవేరులకు వివిధ రకాల స్వీట్లు, పండ్ల నివేదన, దంపత తాంబూలాలతో కళ్యాణోత్సవాలు సమాప్తమయ్యాయి. దేవాలయ ఆస్థాన ప్రధాన పురోహితులు ఆర్. బి.బి. కుమారశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించగా, శైవాగమ విద్వాన్ చంద్రమౌళి ప్రభాకర సత్యనారాయణ శర్మ, చంద్రమౌళి మల్లీశ్వరి శర్మ బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా దేవా లయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమా వెంకట బాలాజికుమార్ మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడంలో భక్తుల సహకారం విశేషమని తెలిపారు. ఆహ్వా న కమిటీ అధ్యక్షులు సుగ్గు విజయకుమార్, పెంటపాటి సోమయాజులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈ వేడుకల్లో ఆర్యవైశ్య సమాజానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో



పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

# విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రమ్ ఐడియా టు ఇంపాక్ట్: రీసెర్చ్ ఎథిక్స్ అండ్ ఆర్ అండ్ డి బెస్ట్ ప్రాక్టీసెస్ పై సదస్సు






**గాజువాక :పెన్ పవర్, మార్చి 6:** దువ్వాడ విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటోనమస్ లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగం, విజ్ఞాన్ ఆర్ అండ్ డి సెల్ సహకారంతో ఫ్రమ్ ఐడియా టు ఇంపాక్ట్ రీసెర్చ్ ఎథిక్స్ అండ్ ఆర్ అండ్ డి బెస్ట్ ప్రాక్టీసెస్ అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మరియు అధ్యాపకులకు పరిశోధనలో నైతిక విలువలు, బాధ్యతాయుత ఆవిష్కరణలు మరియు పరిశోధన-అభివృద్ధి రంగంలోని ఉత్తమ పద్ధతులపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. కె. సుబ్బా రెడ్డి, జనరల్ మేనేజర్ మరియు టెక్ లీడ్ కంప్యూటర్ విజన్, ఐఐటీ తిరుపతి నవవిష్కార్ ఐ-హబ్ ఫౌండేషన్ ఐఐటీటీఎన్ఐఎఫ్ పాల్గొని ఉపన్యాసం ఇచ్చారు. ఆయన ప్రసంగంలో పరిశోధనలో నైతిక విలువల ప్రాముఖ్యత, బాధ్యతాయుత ఆవిష్కరణలు మరియు ఆర్ అండ్ డి లో అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతుల గురించి వివరించారు. వినూత్న ఆలోచనలను వ్యవస్థబద్ధమైన పరిశోధన మరియు అకాడెమియాఇండస్ట్రీ సమన్వయం ద్వారా సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలుగా మార్చవచ్చని తెలిపారు. సెమినార్ సందర్భంగా సైబర్-ఫిజికల్ సిస్టమ్స్, రోబోటిక్స్, సెన్సార్స్, యాక్చ్యుయేటర్స్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో స్వదేశీ సాంకేతిక అభివృద్ధి అవసరాన్ని పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ రవాణా సమస్యలు, జీవీఎంసీ వ్యర్థ నిర్వహణ వంటి సామాజిక సమస్యలకు ఎలక్ట్రానిక్స్ మరియు డిజిటల్ టెక్నాలజీల ద్వారా పరిష్కారాలు అందించవచ్చని ఉదాహరణలతో వివరించారు. పరిశోధనలో నూతనత, విధానం, ధృవీకరణ, డాక్యుమెంటేషన్, సరైన డేటా సేకరణ, ఆల్గారిథమ్ అభివృద్ధి, సిమ్యులేషన్ మరియు వాస్తవ పరిస్థితుల్లో పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా బేసిక్, అప్లైడ్, ట్రాన్స్‌లేషనల్, ఎక్స్‌పెరిమెంటల్, థియరెటికల్ వంటి వివిధ రకాల పరిశోధనలను వివరించి, ప్లేజరిజం, డేటా ఫ్యాబ్రికేషన్, ఫాల్సిఫికేషన్ వంటి సమస్యలతో పాటు సరైన సిటేషన్ మరియు బాధ్యతాయుత రచయితత్వం అవసరాన్ని ప్రస్తావించారు. పరిశోధన అభివృద్ధిలో టెక్నాలజీ రెడినెస్ లెవల్స్ ప్రాముఖ్యతను వివరించి, టి ఆర్ ఎల్-4 నుండి టి ఆర్ ఎల్ -7 వరకు దశలను తెలియజేశారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ హెల్త్, ఇండస్ట్రీ 4.0, ఐఓటీ సైబర్ సెక్యూరిటీ, వీడియో అనలిటిక్స్ వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన రంగాల్లో పరిశోధన చేయాలని సూచిస్తూ, కంప్యూటర్ విజన్ ఆధారంగా ఫోటోప్లెథిస్మోగ్రఫీ ద్వారా కాంటాక్ట్‌లెస్ హెల్త్ మానిటరింగ్ వంటి భవిష్యత్తు ఆరోగ్య సాంకేతిక పరిజ్ఞానాలపై కూడా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిపుణుడితో చర్చలు జరిపి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సదస్సును కే. లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈసీఎం విభాగం సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదన రావు, డీన్ , రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డా. క్రాంతి కుమార్ గంగు, మరియు ఈసీఎం విభాగాధిపతి డా. హెచ్. దేవన్న విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. పరిశోధనలో నైతిక విలువలను పాటించడం ఎంత ముఖ్యమో పేర్కొంటూ, విద్యార్థులు పరిశోధన మరియు ఆవిష్కరణలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సాంకేతిక అభివృద్ధి మరియు సమాజాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ప్రోత్సహించారు.

## అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారి సమీక్ష





**పద్మనాభం,పెన్ పవర్, మార్చి 06 :** పద్మనాభం మండలంలో జరుగుతున్న అభి వృద్ధి కార్యక్రమాలను మండల ప్రత్యేక అధికారి శ్రీమతి కె. జ్ఞానవేణి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీ లించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ప్రాంతాలను సందర్శించి సంబంధిత అధికారు లకు పలు సూచనలు చేశారు. మొదటగా ఆమె బి.ఆర్. తాళ్లవలస జెడ్పీ హై స్కూల్‌ను సంద ర్శించి 10వ తరగతి విద్యార్థుల చదువు ప్రగ తిని పరిశీలించారు. తక్కువ మార్కులు సాధి స్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారికి అదనపు బోధన అందించాలని ఉపాధ్యాయు లకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోష కాహారం మెరుగుపడేందుకు ప్రోటీన్ రిచ్ ఆహా రం అందించాలని పేర్కొంటూ రూ.5,000లను అందజేశారు. అనంతరం కృష్ణాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని హౌసింగ్ లే అవుట్, గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి నిర్వహణ, సదుపాయా లను పరిశీలించారు. తరువాత పద్మనాభం మండల కార్యాలయంలో మండల స్థాయి అధి కారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు.

అనంతరం పద్మనాభం బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఆమె, విద్యార్థుల వసతి, ఆహారం మరి యు ఇతర సదుపాయాలపై వివరా లు తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వి. నగేష్‌తో పాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 9న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం.

ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 6.** చింతపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆమె కోరారు. అలాగే ఎంపీటీసీలు జడ్పిటిసిలు సర్పంచులు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు హాజరయ్యి మండలంలో జరిగే ప్రతి యొక్క అభివృద్ధి కార్యక్రమానికి సహకరించాలని ఆమె కోరారు. మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులతో పాటు ప్రతి ఒక్కరు హాజరుకావాలని, ఏ ఒక్కరు గైర్హాజరు కాకుండా రావాలని ఆమె కోరారు.

## విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరుపై అవగాహన




**పద్మనాభం,పెన్ పవర్, మార్చి 06 :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకుని పద్మనాభం పోలీస్ స్టేషన్ ఆధ్వ ర్యంలో విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూ రిబాయి గురుకుల బాలికల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులను పోలీస్ స్టేషన్‌కు ఆహ్వానించి అక్కడి విధులు, వ్యవస్థపై వివరించారు. ఈ సందర్భంగా పద్మనాభం సీఐ సి. హెచ్. శ్రీధర్ విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో ఉండే విభాగాలు, సీఐ, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసుల విధులు గురించి వివరించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే రికార్డులు, నిందితులను ఉంచే ప్రత్యేక గదులు తదితర అంశాలను చూపిస్తూ పోలీస్ వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పిం చారు. అలాగే పూర్వం సమాచారాన్ని సేకరించేం దుకు కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆధారపడా ల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రతి ఒక్కరి వద్ద సెల్ ఫోన్లు ఉండటంతో సమాచార మార్పిడి చాలా సులభమైందని తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీసులు రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తారని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో మార్చి 4వ తేదీ నుంచి పలు పాఠశాలల్లో విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామ ని తెలిపారు.

## కుట్టుమిషన్ శిక్షణ గృహిణులు, నిరుద్యోగ మహిళలకు సదవకాశం.

- శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోండి.
- కే వీ ఐ సి ఖాదీ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం.

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 6.** గృహిణులు, నిరుద్యోగ మహిళలు తీసుకున్న కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కు కోవాలని విశాఖపట్నం కి చెందిన కే వీ ఐ సి ఖాదీ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. గత నెల 19 నుంచి లంబసింగి ఎఫ్ పీ ఓ రాజు పాకాల సమీపంలో గృహిణుల, నిరుద్యోగ మహిళలు 40 మందికి రెండు బ్యాచ్ లుగా కుట్టు మిషన్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన కుట్టు మిషన్ శిక్షణ పొందిన గృహిణులు, నిరుద్యోగ మహిళలను శిక్షణా తరగతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణా తరగతుల ద్వారా నేర్చుకుని కుట్టి తెచ్చిన వస్త్రాలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడచిన 15 రోజులపాటు పొందిన శిక్షణ ద్వారా మహిళలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి బట్టలు కుట్టడం సంతోష కరమన్నారు. ఈ నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచు కోవలసిన అవసరం ఉందన్నారు. శిక్షణ పొందిన మహిళలకు త్వరలో ఉచితంగా ఒక్కొక్కరికి 25 వేల రూపాయల విలువచేసే కుట్టు మిషన్ లు అందజేయడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ కుట్టు మిషన్ లు శిక్షణ పొందిన ప్రతి మహిళ ఆ కుట్టు మిషన్ లను అమ్ముకోకుండా వాటి ద్వారా ఆర్థికంగా ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాదీ సొసైటీ అధ్యక్షులు ఐ వి రమణ, పెదబరడ మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ, లంబసింగి ఎఫ్ పి ఓ నిర్వాహకుడు రాజేష్, మాస్టర్ ట్రైనర్స్ రామలక్ష్మి, గణపతమ్మ, ఎఫ్ పీ ఓ సభ్యులు కూడా సరోజ (రూతు), కూడా ఇందిరా, రాహుల్, రాజు, అధిక సంఖ్యలో కుట్టుమిషన్ శిక్షకులు పాల్గొన్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## తుంగ్లాంలో సంతోషిమాత ఆలయం పునర్నిర్మాణం



**కూర్మాన పాలెం పెన్ పవర్, మార్చి 06:** తుంగ్లాం లో శ్రీ సంతోషిమాత అమ్మవారి ఆలయం పునః నిర్మాణంకై శ్రీ రామా నంద భారతి స్వామి భువనేశ్వరి పీఠాధిపతి చేతులమీదశంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. తదనంతరం తారక రామ కళ్యాణ మండపంలో స్వామి వారు ఉపాసన చేశారు. కార్యక్రమంలో 10 మంది వేద పండితులు 11 మంది దంపతుల చేత పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం మీకోసం కార్యక్రమం.

- ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి.



**చింతపల్లి పెన్ పవర్ మార్చి 6.**
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇకపై ప్రతి సోమవారం మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులతో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సిహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రజలు తమ సమస్యలను మీకోసం కార్యక్రమం ద్వారా తెలియజేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమం మండల కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. మీకోసం కార్యక్రమం ద్వారా ప్రజల తమ సమస్యలను తెలియజేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. శాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదన రావు, డీన్ , రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డా. క్రాంతి కుమార్ గంగు, మరియు ఈసీఎం విభాగాధిపతి డా. హెచ్. దేవన్న విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. పరిశోధనలో నైతిక విలువలను పాటించడం ఎంత ముఖ్యమో పేర్కొంటూ, విద్యార్థులు పరిశోధన మరియు ఆవిష్కరణలలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. సాంకేతిక అభివృద్ధి మరియు సమాజాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ప్రోత్సహించారు.

## జనసేన 'ఉద్యమి' సభ్యత్వ నమోదు వేగవంతం

**రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య**



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,మార్చి 6:** రాబోయే తరాలకు పునాదులు వేస్తూ సరికొత్త సైన్యం నిర్మాణ దిశగా జనసేన పార్టీ చేపట్టిన "ఉద్యమి" సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని పాడేరు అసెంబ్లీఅరకు పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య తెలిపారు.పార్టీ బలోపేతానికి కీలకమైన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు చూపుతున్న చొరవ అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.పార్టీ ఆశయ సాధన కోసం తక్కువ సమయంలోనే పెద్ద సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేస్తూ కార్యకర్తలు సమూహంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని ఓ సవాలుగా స్వీకరించి తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే విధంగా పనిచేస్తుండటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ప్రత్యేక చొరవతో ప్రతి ఒక్కరినీ జనసేన కుటుంబంలో చేర్చుకుంటూ కొత్త సైన్యాన్ని నిర్మించేందుకు కార్యకర్తలు చేస్తున్న కృషి ఫలితంగా సభ్యత్వ నమోదు శరవేగంగా కొనసాగుతోందని తెలిపారు.అయితే కొంతమంది కార్యకర్తలు చురుకైన పాత్ర పోషిస్తున్నప్పటికీ, కొందరు మాత్రం ప్రత్యేక చొరవ చూపడంలో వెనుకబడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్న వారు ఒక్కో సభ్యత్వాన్ని నమోదు చేస్తూ మెట్టుమెట్టుగా తమ భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని, మరికొందరు మొదటి మెట్టుదగ్గరే ఆగిపోతున్నారని అన్నారు. ఇది కొంత నిరాశ కలిగించే విషయమని పేర్కొన్నారు.జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా జరుగుతున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ చురుకైన పాత్ర పోషిస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని గంగులయ్య సూచించారు.మిగిలిన రోజుల్లో వచ్చిన సభ్యత్వ లక్ష్యాలను అధిగమించేందుకు సాధక్‌లు ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఎవరి భవిష్యత్తుకు వారే మార్గదర్శకులని, అవకాశాలు అందరికీ సమానంగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకున్నవారే తమ భవిష్యత్తును నిర్మించుకుంటారని అన్నారు.అత్యంత విజయవంతంగా సభ్యత్వ నమోదు చేస్తున్న వారిని ఆదర్శంగా తీసుకుని ఇతరులు కూడా అదే మార్గంలో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే సందర్భంగా ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో లక్ష్యాలను అధిగమించిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేయడంతో పాటు సత్కార, సన్మాన కార్యక్రమాలు నిర్వహించే ఆలోచన కూడా ఉందని గంగులయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన కుటుంబ సభ్యులు అందరూ చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి సహకరించాలని ఆయన కోరారు.


## రైతులతో పీఎం మోదీ ముఖాముఖి



**గూడెం కొత్తవీధి పెన్ పవర్, మార్చి 6:**రైతులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా సహకార సంఘాలు సమర్థంగా పనిచేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు, రైతులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమానికి జీకేవిధి వ్యవసాయ సహకార సంఘం (కోపరేటివ్ బ్యాంక్) ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. కోపరేటివ్ బ్యాంకుల ద్వారా రైతులకు అందిస్తున్న ఆర్థిక భరోసా, రుణాల పంపిణీ విధానాలపై ప్రధాన మంత్రి దిశానిర్దేశం చేశారు. రైతుల అభివృద్ధికి సహకార సంఘాలు ఎల్లప్పుడూ అండగా నిలవాలని సూచించారు.రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని, రుణాల వసూళ్లలో వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమం దృష్ట్యా సహకార బ్యాంకులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ రీమల పొలు, చైర్మన్ ముట్టడం నూకరాజు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, సీఈఓ చిన్నబ్బాయి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు వరం..

## జేఎన్‌టీయూ-జీవీ 'అవకాశాల పోర్టల్'



Phone: Off: 08922 - 294316
Mobile No: 8897344078
Email: registrar@jntugv.edu.in

...ECHNOLOGICAL UNIVERSITY-GURAJADA-VIZIANAGARAM
VIZIANAGARAM – 535 003 Andhra Pradesh (India)
(Established by Andhra Pradesh Act No.22 of 2021)

...No. JNTUGV/Job Fair 2026/2026 Dt: 24-02-2026

Dr. G. Jaya Suma,
M. Tech. Ph. D
REGISTRAR.

To
The District Collector,
Vizianagaram
Srikakulam
Parvathipuram Manyam
Alluri Seetharama Raju
Visakhapatnam
Anakapalli

Respected Sir,

Sub: Jawaharlal Nehru Technological University Gurajada Vizianagaram – Opportunities Portal – Request for wide circulation – Regarding.

-o0o-

I am are pleased to inform you that JNTU-GV, in association with Nirmaan Organization, has launched the "Opportunities for Unemployed Youth - Portal", an initiative aimed at empowering unemployed youth through structured employment facilitation, monthly opportunity updates, and periodic skill development programs.

The primary objective of this initiative is to provide continuous career support to unemployed individuals from diverse educational backgrounds including MBA, MCA, M.Pharm, B.Tech, B.Pharm, B.Sc, B.Com, BBA, BBM, Diploma, and ITI (pass or fail). The cell will maintain a dynamic database and provide verified job opportunities every month, along with industry-aligned skill training.

In this regard, I request your good office to kindly extend support by facilitating wide circulation of the enclosed poster across district-level administrative offices, mandal offices, village secretariats, employment exchanges, skill development centres, and other relevant platforms to ensure maximum outreach among unemployed youth.

Your support in disseminating this information will significantly contribute to strengthening employment opportunities and youth empowerment in the district.

Register@ uyopportunities.jntugv.edu.in

G. Jayasuma
REGISTRAR
REGISTRAR
JNTU-GV
VIZIANAGARAM-535003

Copy to
PS to the Hon'ble Vice-Chancellor, JNTUGV

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 06:** నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు విజయనగరం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ–జీవీ) నడుం బిగించింది. 'నిర్మాణ్' సంస్థతో కలిసి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని యువత కోసం ప్రత్యేకంగా 'అవకాశాల పోర్టల్' ను ప్రారంభించింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. జయసుమ ఉత్తర్వులు జారీ చేస్తూ, ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరుతూ విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు.

అన్ని విభాగాల వారికీ అవకాశం

ఈ పోర్టల్ కేవలం ఇంజినీరింగ్ విద్యార్థులకే పరిమితం కాకుండా.. ఎంబీఏ, ఎంసీఏ, ఎం.ఫార్మసీ, బీటెక్, బీ.ఫార్మసీ వంటి ప్రొఫెషనల్ కోర్సులతో పాటు బీఎస్సీ, బీకామ్, బీబీఏ, బీబీఎం, డిప్లొమా, ఐటీఐ (పాస్ లేదా ఫెయిల్) చదివిన వారందరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రతి నెలా ధ్రువీకరించబడిన ఉద్యోగ అవకాశాల సమాచారాన్ని ఈ పోర్టల్ ద్వారా నిరుద్యోగులకు అందిస్తారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గ్రామ సచివాలయాలు, మండల ఆఫీసులు, ఉపాధి కార్యాలయాల ద్వారా ఈ పోర్టల్ గురించి యువతకు తెలిసేలా చర్యలు తీసుకుంటున్నట్లు రిజిస్ట్రార్ చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు బఎశీజూజూశీతీబఅఱవం.యఅబస్త్రజ.వసబ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్

- కోరాడ కాలనీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- గడువు తీరిన చిక్కీలపై ఆగ్రహం.. హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. మార్చి 06 :** హిరమండలంలోని కోరాడ కాలనీ (సుబలాయి పునరావాస కేంద్రం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, ప్రజల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. స్వయంగా తన ప్లేటును తానే శుభ్రం చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. మెనూ ప్రకారం అందిస్తున్న గుడ్డు కూర, అన్నం రుచిగా ఉన్నాయని వంట ఏజెన్సీని అభినందించారు.

భోజనం అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరుశనగ చిక్కీలను కలెక్టర్ పరిశీలించారు. ఈ క్రమంలో ఒక ప్యాకెట్ గడువు తీరిపోయినట్లు గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు గాను పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు కె. ఎస్తేర్ రాణికి అక్కడికక్కడే షోకాజ్ నోటీసు జారీ చేశారు. స్టాక్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, గడువు తీరని పదార్థాలనే పిల్లలకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

మౌలిక వసతులకు పెద్దపీట

పాఠశాల ఆవరణ పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు లక్ష రూపాయలు, అలాగే భద్రతా పరంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ. 25 వేల నిధులను మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ నిధులను తక్షణమే ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పలువురు మండల స్థాయి అధికారులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## గిరిజనులపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి.



డిఎల్ఓ కేంద్ర కమిటీ సభ్యుడు సమిరెడ్డి మాణిక్యం.

**చింతపల్లి, పెన్ పవర్ మార్చి 6.** రహదారి విషయంలో వివాదం జరిగి చలగలగడ్డ గిరిజనులపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని దండకారణ్య ఎబరేషన్ ఆర్గనైజేషన్ (డి ఎల్ వో) కేంద్ర కమిటీ సభ్యులు సమిరెడ్డి మాణిక్యం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక గిరిజన భవన్లో జలగల గడ్డ గిరిజనులతో దండకారణ్య లిబరేషన్ ఆర్గనైజేషన్ నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్ఓ కేంద్ర కమిటీ సభ్యుడు గాయపడిన గిరిజనులతో కలిసి మాట్లాడుతూ కొంతకాలంగా రహదారి నిర్మాణ విషయమై జలగల గడ్డ లంబసింగి గిరిజనుల మధ్య వివాదం నెలకొందన్నారు. రెండు రోజుల క్రితం రహదారి నిర్మాణ విషయమై రెండు గ్రామాల గిరిజనుల మధ్య గొడవలు జరిగాయన్నారు. ఈ వివాద సమయంలో సంబంధం లేని గిరిజనేతరులు జోక్యం చేసుకొని జలగలగడ్డ గిరిజనులను తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై గిరిజనులు చింతపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయలేదన్నారు. వాస్తవానికి జలగలగడ్డ గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం పీఎం జన్మన్ 11 లో భాగంగా 90 లక్షల రూపాయల నిధులు రహదారి నిర్మాణానికి మంజూరు చేసిందన్నారు. ఈ రహదారి నిర్మాణంలో లంబసింగికి చెందిన గిరిజనులు తమ భూములు నష్టపోవాల్సి వస్తుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే చింతపల్లి తహసిల్దార్ డిసెంబర్లో సర్వే చేపట్టి రహదారి నిర్మాణాలకు ఎటువంటి అభ్యంతరాలు లేవని ఎండార్స్మెంట్ జారీ చేశారన్నారు ఈ నివేదిక ఆధారంగా ఇంజనీరింగ్ అధికారులు పనులు ప్రారంభించారని రహదారి నిర్మాణాలు ప్రారంభించేందుకు పోలీసులు బందోబస్తు కల్పించాలన్నారు. అలాగే రహదారి నిర్మాణంలో లంబసింగి గిరిజనుల భూములు పంటలు కోల్పోతే ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. ప్రధానంగా జలగల గడ్డ గిరిజనులపై దాడి చేసిన గిరిజన నేతరులపై వెంటనే హత్యా నేరం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు. రహదారి నిర్మాణాలకు కలిగిన అడ్డంకులను రెవెన్యూ అధికారులు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఓ కేంద్ర కమిటీ సభ్యుడు చండా కేశవరావు, జిల్లా అధ్యక్షుడు మార్కు రాజు, నాయకులు అశోక్ ,కవడం కాసులమ్మ, కాకి వెంకాయమ్మ ,పీ .మోహిని ,ఆనందకుమారి ,గిరిజన సంఘం జిల్లా నాయకులు పాంగి ధనుంజయ్, సాగిన చిరంజీవి ,మాజీ సర్పంచ్ కుర్రా రఘునాథ్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు మర్రి గురుమూర్తి పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా దారాలమ్మ తల్లి జాతర ముహూర్తం రాట కార్యక్రమం



భక్తి శ్రద్ధలతో గరగ అలంకరణ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, మార్చి 6:**అంతరాష్ట్ర భక్తుల ఆరాధ్య దైవం శ్రీశ్రీ దారాలమ్మ తల్లి 60వ మహోత్సవశీ సందర్భంగా శుక్రవారం ఉదయం 9:39నిమిషాలకు ముహూర్తపురాటను దేవాలయం ఈవో సాంబశివరావు,ఎంపీపీ బోయిన కుమారి, కూటమి నాయకులు పోతురాజు గోవిందు , మరియు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో వేశారు. తరువాత11:06 నిమిషాలకు అమ్మవారి గరగల అలంకరణ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించడానికి ఇప్పటికే దేవాలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈవో సాంబశివరావు విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాలు భాగంగా ఈ నెల 16 తారీఖున అమ్మవారి కలశస్థాపన, 18 వ తారీఖున అమ్మవారి జాతర నిర్వహిస్తామని, మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని, అదే రోజు

సాయంత్రం అమ్మవారికి మహా నివేదన కార్యక్రమం నిర్వహించి ఆలయ తలుపులు మూసి వేస్తామని అన్నారు.19వ తారీఖున సాంప్రదాయ ప్రకారం అమ్మవారి ఆలయ ద్వారాలు తెరుస్తామని. ఈ సందర్బంగా భక్తులు వారి మొక్కలు చెల్లించుకోవచ్చని ఈవో సాంబశివరావు తెలిపారు.దూరం నుంచి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక పరిషత్ ట్రస్ట్ ఏపీ మెంబర్ పి.ఈశ్వరరావు ,వైస్ ఎంపీపీ, దేవరపల్లి ఎంపీటీసీ పోతురాజు కృష్ణమూర్తి,రింతాడ సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి,గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ,పెద్దలు తగ్గి రాజారావు,తగ్గి,సూర్యనారాయణ, సుంకరి విష్ణుమూర్తి, నడిగోట్ల,బాబి, గడుతూరి రాజ్ కోటి, తగ్గి భద్రం, గొర్లె బర్సయ్య,గడుతూరి గిరి, సాలం మోహన్ రావు, పోతురాజు జగన్నాథం, తగ్గి రామకృష్ణ,. ధారకొండ చుట్టూ పక్క ల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గూడెంకొత్తవీధిలో రక్తదాన శిబిరం





**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,మార్చి6:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తహసిల్దార్ హెచ్. అన్నాజీ రావు, ఎంపీడీవో రమణబాబు, సీఐ సుధాకర్, ఎస్సై సురేష్, ఏటిడబ్ల్యువో జయ నాగలక్ష్మి ప్రారంభించారు.తహసీల్దార్ హెచ్ అన్నాజీ రావు,డీటీ దుమంతి సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 69 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయటానికి ముందుకు వచ్చారు. యువత,ఉద్యోగులు, పాత్రికేయులు, పోలీస్ శాఖ సిబ్బంది శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఎస్సై సురేష్ కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

## రైతుల వద్ద కాఫీలు ప్రభుత్వమే కొనాలి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 6:** రైతుల వద్ద ఉన్న కాఫీని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ కంకిపాటి గిరిప్రసాద్, అడప విష్ణుమూర్తి నేతృత్వంలో స్పందన కార్యక్రమంలో ప్రభుత్వానికి వినతి వినతి పత్రం అందజేశారు. గతంలో ప్రకటించిన రేట్ల మేరకు జిసిసి (కాఫీ) కొనుగోలు ప్రభుత్వమే చేయాలని రైతులు కోరుతున్నారు.గూడెం కొత్త వీధి,చింతపల్లి,కొయ్యూరు మండలాల్లో ఇంకా 50% కాఫీ రైతులు వద్ద నిలువ ఉందని, వాటిని విక్రయించడానికి రైతులు ఎదురుచూస్తున్నారని వినతి పత్రంలో రైతులు పేర్కొన్నారు, ఆర్గానిక్ సర్టిఫికెట్ ఉన్న ప్రతి రైతు వద్ద ప్రభుత్వం కాఫీలు కొనుగోలు చేయాలి. కాఫీ రేట్లు ఈ సంవత్సరం ఆశాజనకంగా లేకపోవడంతో కూలి, స్కూల్ ఫీజులు చెల్లించడానికి రైతులు ఇబ్బందిలో ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడప చిన్నబ్బాయి, వనపల బాలకృష్ణ, అంపురంగి రాజారావు, అంపురంగి బుజ్జి బాబు, అంపురంగి ఈశ్వరరావు, రమేష్ వంతల, చంటిబాబు, కంకిపాటి నారాయణ, కంకిపాటి రాంప్రసాద్, కంకిపాటి జోగిరాజు, పూజారి బాలరాజు, సిరిబాల రామారావు, పోతురాజు మోహన్ రావు, పూజారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.రైతులు ప్రభుత్వాన్ని ముందడుగు వేయమని, తమ దగ్గర ఉన్న కాఫీలు వెంటనే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# డిసిసి కార్యదర్శి కారే.శ్రీను.



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 6:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో అన్ని మండల కేంద్రాలలో జనరిక్ మందులు షాపులు ఏర్పాటు చేయాలని డిసిసి కార్యదర్శి కారే శ్రీనువాసు కోరారు.ఈ సందర్భంగా స్థానిక పత్రిక విలేకరులతో మాట్లాడుతూ జనరిక్ మెడికల్ స్టోర్స్ నవంబర్ 2008 భారతదేశం లో మొదలయ్యాయి.మధ్యతరగతి మరియు నిరుపేద రోగుల ఆరోగ్య సంరక్షణ ఖర్చులను తగ్గించే లక్ష్యంతో ఈ కార్యక్రమం జన్ ఔషధి మెడికల్ ప్రారంభమైందని తర్వాత ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన (పీఎంబీజేపీ)గా పేరు మార్చబడిందని అన్నారు.వెనకబడిన గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలం కేంద్రాలలో జన్ ఔషధి మెడికల్ షాప్స్ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలను కోరారు. ఈ గిరిజన ప్రాంతంలో జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేసినట్లయితే మారుమూల గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందని మన రాష్ట్రప్రభుత్వం ఆ విధంగా ఆలోచన చేయాలని ఈ సందర్భంగా అన్నారు.

# బీసీ కమిటీ నివేదిక తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

**విజయవాడ, మార్చి 6, పెన్ పవర్:** ఏపీ పాలిటిక్స్‌లో స్థానిక పోరు ఊరిస్తోంది. న్యూఇయర్ స్టార్టింగ్‌లోనే పంచాయతీ ఎలక్షన్స్ పెడతారని ఊహాగానాలు వినిపించినప్పటికీ..ఇప్పటికీ ఓ క్లారిటీ లేదు. జనగణన అడ్డంకిగా మారిందన్న ప్రచారం ఓవైపు.. స్టేట్ ఈసీ రివ్యూస్..లోకల్ బాడీ పోల్స్‌పై సస్పెన్స్‌ను కంటిన్యూ చేస్తున్నాయి. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2న ముగుస్తుంది. మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం అయిపోనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక వరుసపెట్టి జూన్ లోపు స్థానిక ఎన్నికలను పూర్తి చేయాలనుకుంది ఏపీ సర్కార్. కానీ ఇంతలోనే ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీ అమలు దిశగా అడుగులు వేసింది. ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ రిపోర్ట్ ఇచ్చాక బీసీ కోటా పెంపుపై ఏదో ఒక నిర్ణయం తీసుకున్నాకే..లోకల్ ఫైట్‌పై ముందడుగు వేస్తారన్న టాక్ బయలుదేరింది.మరోవైపు రాష్ట్ర ఎన్నికల కమిషన్..ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? ఎంతమంది అనర్హులు ఉన్నారనే వివరాలను సేకరిస్తోంది. ఈ నెల 20 నాటికి ఈ కసరత్తు పూర్తి చేసి..ఓటర్ల జాబితాను ఫైనల్ చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీని ప్రకారం..ఏప్రిల్ 2వ తేదీతో ముగియనున్న పంచాయతీలకు గడువు ప్రకారం..ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీ రెడీగా ఉన్నట్లే. కానీ పల్లె పోరుపై సర్కారు ఆలోచన మాత్రం వేరేగా ఉందట. ఏప్రిల్ 2నే గ్రామాల స్థాయిలో పంచాయతీలకు గడువు ముగిసిపోనున్నా..ఈ ఎన్నికలకు బ్రేక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.బీసీ రిజర్వేషన్లపై మిశ్రా కమిషన్ అధ్యయనం చేస్తోంది. ఆ రిపోర్ట్ వచ్చిన తర్వాత..ప్రభుత్వం అధ్యయనం చేసి..ఎన్నికలకు వెళ్లనుందని అంటున్నారు. ఈ ప్రాసెస్‌కు కొంత టైమ్ పట్టే అవకాశం ఉంటుంది. ఇక రిజర్వేషన్లపై ఎలాగూ న్యాయపరమైన సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాటిన్నింటిని సాల్వ్ చేసుకుని..బీసీ కోటాను పెంచే లోకల్ బాడీ ఎన్నికలపై ముందుకెళ్లాలని సర్కార్ భావిస్తోందట.ఇలా స్థానిక పోరుపై ఎప్పటికప్పుడు అప్ డేట్స్ కమింగ్ సూన్ అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసినా..కూటమి ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను కాస్త ఆలస్యంగా నిర్వహించే యోచనలోనే ఉందంటున్నారు. ఏప్రిల్‌లోపు ఎన్నికలకు వెళ్తారని ప్రచారం జరుగుతున్న టైమ్‌లోనే ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. లోకల్ బాడీస్‌లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచాలని డిసైడ్ అయింది. ఈ క్రమంలో సెన్సేషనల్ డెసిషన్ తీసుకుంది కూటమి ప్రభుత్వం.బీసీ కోటా పెంపు సాధ్యాసాధ్యాలు, న్యాయ సమస్యల అధ్యయనానికి కమిషన్ వేసింది సర్కార్. బీసీలకు రాజకీయంగా మేలు చేసే ఉద్దేశంతో ఏకంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు స్టార్ట్ చేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కోసం మాజీ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది సర్కార్. ఈ కమిషన్ పూర్తిగా అధ్యయనం చేసి తన నివేదికను ప్రభుత్వానికి ఇస్తుంది. 45 రోజుల్లో నివేదికను ఇవ్వాలని కూడా ఏకసభ్య కమిషన్‌కు కాల పరిమితిని విధించింది సర్కార్. కమిషన్ ఇచ్చే రిపోర్ట్‌ను బేస్ చేసుకుని బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ప్రభుత్వం డెసిషన్ తీసుకోనుంది.బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలకు


వెళ్లాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. బీసీలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకుని ఎన్నికలకు వెళ్తే తమకు ఇంకా అడ్వాంటేజ్ మారుతుందని..బెటర్ రిజల్ట్స్ వస్తాయని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో ఎలాగూ అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశం ట్రంప్ కార్డుగా వాడుకునేందుకు ప్లాన్ చేస్తోంది ప్రభుత్వం. అయితే రిజర్వేషన్లు పెంపు హామీకి కూటమి సర్కార్ కట్టుబడి ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టు నిబంధనలు అడ్డుగా మారే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పే..బీసీ రిజర్వేషన్ల పెంపునకు సమస్యలు తెచ్చి పెడుతోంది. ఏపీలో ఇప్పటికే బీసీలకు 24 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. దీనిని 34 శాతానికి పెంచితే మొత్తం రిజర్వేషన్లు 60 శాతానికి చేరి సుప్రీంకోర్టు పెట్టిన కోటా దాటిపోనుంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కలెక్టర్ రంగంలోకి దిగి....

**తిరుపతి, మార్చి 6,పెన్ పవర్:** తిరుపతి జిల్లాలో తహసీల్దారు తీరుపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. ప్రజల సమస్యల్ని పరిష్కరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ భూ సమస్యపై విశ్రాంత సైనికుడు తహసీల్దారుకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో ఆయన కలెక్టర్‌ను కలిశారు.. ఈ క్రమంలో పుల్లంపేట తహసీల్దారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులతోనే నేరుగా అధికారులకు ఫోన్ చేయించగా.. వారు నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడంతో సస్పెండ్ చేస్తానని హెచ్చరించారుతిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తహసీల్దార్‌తో పాటూ రెవెన్యూ సిబ్బంది ఊహించిన షాకిచ్చారు. ఓ విశ్రాంత సైనికుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కలెక్టర్.. ఆ బాధితుడితో అధికారులకు ఫోన్ చేయించి అడ్డంగా బుక్ చేశారు. విశ్వేశ్వరరావు సైనికుడిగా పనిచేశారు.. పదవీ విరమణ తర్వాత పుల్లంపేట ప్రాంతంలో ప్రభుత్వం 5.44 ఎకరాల భూమి కేటాయించింది. అయితే గత 20 ఏళ్లుగా ఈ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు.. బాధితుడు తహసీల్దారు చుట్టూ తిరిగి, తిరిగి విసుగొచ్చింది. ఎన్నిసార్లు వెళ్లి మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విశ్వేశ్వరావు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారుపుల్లంపేట తహసీల్దారు పుల్లారెడ్డి, వీఆర్వో బొమ్మి శ్రీనివాసులు తన సమస్యను పరిష్కరించడం లేదని కలెక్టర్ దగ్గర తన గోడు వెళ్లబోసుకున్నారు విశ్వేశ్వరరావు. వెంటనే స్పందించిన కలెక్టర్.. తన ఎదురుగానే తహసీల్దారుకు ఫోన్ చేయాలని సూచించారు. ఆయన వెంటనే ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని మరోసారి కోరారు. తహసీల్దారు మరోసారి నిర్లక్ష్యంగానే సమాధానం చెప్పారు. ఆ భూమికి పట్టా ఉన్న సంగతి నిజమే.. కానీ ఆ భూమి మీ ఆధీనంలో లేదు కాబట్టి సర్వే చేయడం కుదరదని తహసీల్దారు అన్నారు. వెంటనే కలెక్టర్ వెంకటేశ్వర్ జోక్యం చేసుకున్నారు. 'విశ్వేశ్వరరావుకు గతంలో ఇచ్చిన పట్టాను రద్దు చేసి మరో ఇవ్వడమో.. ప్రస్తుతం ఇచ్చిన భూమిలో ఆక్రమణలు తొలగించడమో చేయాలి.. పైగా ఆ భూమిని కబ్జా చేసినవారికి మద్దతు తెలుపుతావా' అంటూ కలెక్టర్ తహసీల్దారుపై మండిపడ్డారువిశ్వేశ్వరరావుకు చెందిన భూమి విషయంలో త్వరగా చర్యలు తీసుకోవాలని.. భూమిని కబ్జా చేసిన వాళ్లపై కేసు నమోదు చేయాలని తహసీల్దారును ఆదేశించారు కలెక్టర్ వెంకటేశ్వర్. ఈ పని త్వరగా పూర్తిచేయకపోతే.. ఇద్దర్ని సస్పెండ్ చేస్తానని తహసీల్దారు, వీఆర్వోను హెచ్చరించారు. అలాగే రేణిగుంట విమానాశ్రయానికి దగ్గరలో ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఆ భూమిలో ఒకరు ప్లాట్లు వేస్తున్నారు.. స్థానికుడు ఒకరు స్పందించి వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. అయితే రివర్స్‌లో వీఆర్వో నీకేం సంబంధమంటూ స్థానికుడ్ని ప్రశ్నించారు. దీంతో ఆ వ్యక్తి కూడా కలెక్టర్‌ను కలిసి వీఆర్వోపై ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ నుంచి మరోసారి వీఆర్వోకు సదరు వ్యక్తి ఫోన్ చేశారు.. ఆయన మళ్లీ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కలెక్టర్ ఫోన్ తీసుకుని మాట్లాడారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.. వెంటనే ప్లాట్లు వేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టర్ నేరుగా బాధితులతో ఫోన్లు చేయించి అధికారులకు షాకిచ్చారు.. సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఈ ఊహించని పరిణామంతో అధికారులు అవాక్కయ్యారు.

# రాజ్యసభకు ఇవాళ నితీష్, రేపు చంద్రబాబేనా? -



**విజయవాడ, మార్చి 6 పెన్ పవర్:** బీహార్ రాజకీయాల్లో అజేయుడిగా నిలిచిన నితీష్ కుమార్, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకోవడం భారత రాజకీయాల్లో ఒక కీలక మలుపు. రాజ్యసభ ఎన్నికల్లో ఆయన స్వయంగా నామినేషన్ దాఖలు చేయడంతో, బీహార్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడబోతోందనేది స్పష్టమైంది. ఏపీలో కూడా జూన్ లోపు నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు ఉండటంతో.. నెక్స్ట్ చంద్రబాబు కూడా ఢిల్లీకి వెళ్తారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి.చంద్రబాబు నాయుడుకు ప్రస్తుతం 75 ఏళ్లు. నితీష్ కుమార్ కూడా దాదాపు అదే వయస్సులో ఉండటంతో ఈ పోలిక సహజంగానే వస్తోంది. ఏపీలో గత కొంతకాలంగా లోకేష్ ఎలివేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. క్యాబినెట్ సమావేశాల్లో లోకేష్ ప్రాధాన్యత పెరగడం, ముఖ్యమైన శాఖల నిర్వహణ, విదేశీ పర్యటనల్లో రాష్ట్ర ముఖచిత్రంగా మారడం చూస్తుంటే.. ఆయనను సీఎం పీఠంపై కూర్చోబెట్టి బాబు కేంద్రానికి వెళ్తారనే చర్చకు బలం చేకూరుస్తోంది. అయితే, నితీష్ లాగా చంద్రబాబుకు ఇది విశ్రాంతి సమయం కాకపోవచ్చు.బీహార్, ఏపీల మధ్య ఉన్న అతిపెద్ద వ్యత్యాసం బీజేపీ బలం . బీహార్‌లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది, నితీష్ కుమార్ పార్టీ ( జూనియర్ భాగస్వామిగా మారింది. అక్కడ నితీష్ వైదొలగడం బీజేపీకి అనివార్యమైన అవసరం. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి భిన్నం. ఇక్కడ బీజేపీ ఒక మైనర్ పార్టీ. చంద్రబాబు నాయుడు కేవలం ముఖ్యమంత్రి మాత్రమే కాదు, కూటమికి అసలైన సారథి. బాబు లేకుండా ఏపీలో కూటమి మనుగడ కష్టమని బీజేపీకి కూడా తెలుసని భావిస్తున్నారు. నితీష్ కుమార్ ఇటీవలి కాలంలో కొన్ని ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. విచిత్రంగా ప్రవర్తిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీనికి భిన్నంగా చంద్రబాబు నాయుడు 75 ఏళ్ల వయస్సులోనూ అత్యంత చురుకుగా పనిచేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పాలనాపరమైన సమీక్షలు, జిల్లాల పర్యటనలతో ఆయన బిజీగా ఉంటున్నారు. ప్రస్తుతం ఆయనకు ఎటువంటి ఆరోగ్య ఇబ్బందులు లేకపోవడం, ఆయన తన పదవిని వదులుకునే అవకాశం లేదని స్పష్టం చేస్తోంది. చంద్రబాబు నాయుడుకు ఢిల్లీ రాజకీయాలంటే ఎప్పుడూ ఒక రకమైన విముఖత ఉంది. 1996లోనే ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా కాదనుకుని రాష్ట్ర రాజకీయాలకే పరిమితమైన చరిత్ర ఆయనది. ప్రస్తుత పరిస్థితుల్లో అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి చేయడం ఆయన కలలు. ఇవి ఇంకా ఒక కొలిక్కి రాకుండా ఆయన ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పుకుంటారన్నది ఊహించలేం. నితీష్ కుమార్ లాగా అన్ని సభల్లో సభ్యుడిగా ఉండాలి అనే వ్యక్తిగత మైలురాళ్ల కంటే, రాష్ట్ర పునర్నిర్మాణమే బాబు ప్రాధాన్యత.లోకేష్ ముఖ్యమంత్రి అవుతారనే చర్చ నిజమే అయినప్పటికీ, అది చంద్రబాబును ఢిల్లీకి పంపడం ద్వారా జరుగుతుందా అనేది అనుమానమే. చంద్రబాబు కనీసం 2029 వరకు ముఖ్యమంత్రిగా ఉండి, పాలనలో లోకేష్‌కు పూర్తి పట్టు వచ్చాక, పార్టీ శ్రేణులు , కూటమి భాగస్వామి పవన్ కళ్యాణ్ అంగీకారంతోనే మార్పు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ అనిశ్చితిలో బాబు తప్పుకుంటే అది కూటమికి నష్టం చేస్తుందనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

# క్రిస్టియన్ కార్డు ఎవరికి లాభం... ఎవరికి నష్టం

**విజయవాడ, మార్చి 6, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం 'మతం' చుట్టూ సాగుతున్న రాజకీయం పెను దుమారం రేపుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఒక నిర్దిష్ట మతానికే పరిమితమైన పార్టీగా చిత్రీకరించడంలో తెలుగుదేశం కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా శాసనమండలి వేదికగా జరిగిన పరిణామాలు, సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు వైసీపీని తీవ్రమైన ఆత్మరక్షణలో పడేశాయి.ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు అభివృద్ధి, సంక్షేమం నుంచి మతపరమైన అంశాల వైపు మళ్లుతోంది. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత విశ్వాసాలను ఆసరాగా చేసుకుని, ఆ పార్టీని ఒక క్రిస్టియన్ పార్టీగా ముద్ర వేయడం ద్వారా హిందూ ఓటు బ్యాంకును దూరం చేయాలనేది టీడీపీ పక్కా వ్యూహంగా కనిపిస్తోంది.శాసన మండలిలో మంత్రి అచ్చెన్నాయుడు నేరుగా మండలి చైర్మన్ మోషేన్ రాజు, జగన్మోహన్ రెడ్డిలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఈ వివాదానికి ఆజ్యం పోశాయి. తామంతా హిందువులమని, వారు క్రిస్టియన్లని ఆయన వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది. దీనిపై మోషేన్ రాజు తాను హిందువునని స్పష్టం చేయడం, అచ్చెన్నాయుడు క్షమాపణలు చెప్పడంతో సభలో ఆ వివాదం ముగిసినట్లు కనిపించినా, అసలు కథ సోషల్ మీడియాలో మొదలైంది.సభలో అచ్చెన్నాయుడు వెనక్కి తగ్గినప్పటికీ, టీడీపీ సోషల్ మీడియా విభాగం మాత్రం మోషేన్ రాజు గతంలో చర్చీల్లో పాల్గొన్న వీడియోలు, ఆయన మతపరమైన నేపథ్యాన్ని సూచించే ఫొటోలను బయటపెట్టింది. "నోటితో హిందువునని చెబుతూ, ఆచరణలో క్రిస్టియానిటీని పాటిస్తున్నారు" అనే అర్థం వచ్చేలా చేస్తున్న ప్రచారం వైసీపీని ఇరకాటంలో పడేసింది. ఈ పరిణామం వల్ల పార్టీ నాయకత్వం సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత కొన్ని రోజులుగా తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్చ జరగాలని



వైసీపీ పట్టుబట్టింది. ప్రభుత్వం చర్చకు వెనకాడుతోందని ప్రచారం చేసుకున్న వైసీపీకి, తీరా చర్చ మొదలయ్యాక సీన్ రివర్స్ అయ్యింది. చర్చను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైసీపీ సభ్యులు విఫలమయ్యారు. కేవలం సాంకేతిక అంశాల మీద కాకుండా, భావోద్వేగ అంశాల మీద ప్రభుత్వం చేసిన దాడిని వారు తిప్పికొట్టలేకపోయారు. వైసీపీ హయాంలోనే అపవిత్రం జరిగిందని, హిందూ ధర్మంపై ఆ పార్టీకి గౌరవం లేదని మంత్రులు చేసిన ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. జగన్ 'డిక్లరేషన్' అంశాన్ని కూడా దీనికి ముడిపెట్టడంతో, వైసీపీ కేవలం ఒక మతానికే కొమ్ముకాస్తోందనే భావనను కలిగించడంలో టీడీపీ కూటమి సక్సెస్ అయ్యింది.రాజకీయాల్లో ఒకసారి ముద్ర పడితే దాన్ని చెరిపేసుకోవడం చాలా కష్టం. గతంలో బీజేపీపై ఉన్న 'హిందూత్వ' ముద్రను ఆ పార్టీ బలంగా వాడుకోగా, ఇప్పుడు వైసీపీపై పడుతున్న 'క్రిస్టియన్ పార్టీ' ముద్రను టీడీపీ ఎన్నికల అస్త్రంగా మలుచుకుంటోంది. జగన్మోహన్ రెడ్డి తాను అన్ని మతాలను గౌరవిస్తానని చెబుతున్నా, పార్టీలోని కీలక నేతల మతపరమైన నేపథ్యాలను సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టడం ద్వారా వైసీపీని హిందూ వ్యతిరేక పార్టీగా చూపించే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. దీనివల్ల తటస్థంగా ఉండే హిందూ ఓటర్లు వైసీపీకి దూరం అయ్యే ప్రమాదం ఉంది. తిరుమల వంటి సున్నితమైన అంశాల్లో తడబడటం, సొంత పార్టీ నేతల మతపరమైన క్లారిటీ లేకపోవడం వైసీపీకి పెద్ద మైనస్ పాయింట్లుగా మారుతున్నాయి.

# మంత్రులు కేరాఫ్ అమరావతి- అంతా రెడీ


**విజయవాడ, మార్చి 6, పెన్ పవర్:** ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అమరావతి రాజధాని విషయంలో వేగంగా అడుగులు వేస్తోంది. నిర్మాణాలు సైతం ఊపందుకున్నాయి. అమరావతి రాజధానికి సంబంధించిన కార్యక్రమాలు అన్నీ పెద్ద ఎత్తున సాగుతున్నాయి. నిధులకు కొరత లేకుండా కూడా కూటమి ప్రభుత్వం చూసుకుంటోంది. ఇక ఇప్పటికే అమరావతిలో హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాలు తయారు అయిపోయాయి. అదే విధంగా మంత్రులకు సంబంధించిన క్వార్టర్స్ నిర్మాణం కూడా తుది దశకు వచ్చింది అని అంటున్నారు.

**వచ్చే సెషన్ నుంచి :**

ఇదిలా ఉంటే వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి ఏపీకి చెందిన మొత్తం 175 మంది ఎమ్మెల్యేలు, అలాగే 58 ఎమ్మెల్సీలు, మంత్రుల నివాస సముదాయాలు రెడీ అయ్యేలా నిర్మాణాలు జోరందుకున్నాయి. ఈ విషయాన్ని శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొంటూ రాజధానిలోని మంత్రులు సహా అంతా ఇక మీదట క్వార్టర్లలో ఉండేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

**పుష్కర కాలం తరువాత :**

హైదరాబాద్ రాజధానిగా ఉండగా మంత్రులు అంతా అక్కడ ప్రభుత్వ క్వార్టర్లలో ఉండేవారు, అదే విధంగా ఎమ్మెల్యేలు కూడా ఉండేవారు. కానీ విభజన తరువాత ఏపీకి రాజధాని లేకపోవడం వల్ల రాజధానికి ఎవరు వచ్చినా ఇబ్బంది అవుతోంది. చాలా చోట్ల ప్రైవేట్ వసతి గృహాలను తీసుకుంటున్నారు. ఇపుడు ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేలా అమరావతి రాజధానిలో నిర్మాణాలు తయారు అవుతున్నాయని



అంటున్నారు. దీంతో ప్రభుత్వ క్వార్టర్లలో ఇక మీదట మంత్రులు శాసనసభ్యులను చూడవచ్చు అని అంటున్నారు.

**మూడేళ్ళలో పూర్తిగా :**

ఇక రానున్న మూడేళ్ళ కాలంలో అమ్రావతి రాజధాని పూర్తి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. మౌలిక సదుపాయాలతో పాటు అన్ని రకాల వసతులతో రాజధాని ఒక షేపునకు వస్తుందని అంటున్నారు. దాంతో ప్రభుత్వం తరఫున పూర్తి యాక్టివిటీ అయితే మొదలవుతుంది అని అంటున్నారు. అక్కడ ప్రభుత్వం తరఫున మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అలాగే న్యాయ మూర్తులు, మరో వైపు ప్రభుత్వ ఉద్యోగులు అంతా క్వార్టర్లలో ఉండేందుకు అవసరమైన విధంగా తయారు అవుతుంది. అలాగే ఈ మూడేళ్ళలో ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులు కూడా ఒక కొలిక్కి వస్తాయని అంటున్నారు. అలాగే ప్రభుత్వం చాలా చోట్ల ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన స్థలాలలో అభివృద్ధి ప్రాజెక్టులు కూడా వేగంగా తయారు అయ్యేందుకు అవకాశం ఉంది అని అంటున్నారు. కేంద్ర సహకారంతో అమరావతి రాజధానిని ట్రాక్ లో పెట్టామని మూడేళ్లలో రాజధానికి ఓ రూపు వస్తుందని బాబు చెప్పారు.

**పోలవరం విషయంలో :**

ఇక ఏపీలో జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది జూన్ నాటికి జాతికి అంకితం చేసేలా పనులు వేగంగా చేపట్టామని చంద్రబాబు చెప్పారు. గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేసి నీళ్లు ఇస్తామని అన్నారు. ఈ విషయంలో ఎక్కడా లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకుంటామని బాబు చెప్పరు. దాంతో పోలవరం అమరావతి రాజధాని రెండూ పూర్తి అయితే ఏపీకి అన్ని విధాలుగా ప్రగతి కనిపిస్తుంది అని అంచనా వేస్తున్నారు. ఈ విషయంలో అయితే కూటమి ప్రభుత్వం సీరియస్ గానే ముందుకు అడుగులు వేస్తోంది.

# కలకలం రేపుతున్న విజయసాయి కామెంట్స్

**నెల్లూరు, మార్చి 6, పెన్ పవర్:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వాతావరణంలో "కూటమి ఉన్నంత వరకు వైసీపీకి అవకాశం లేదు" అనే వ్యాఖ్యలు మరోసారి చర్చకు వస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు పార్టీ మాజీ నాయకుడు, మాజీ ఎంపీ వేణు బాకం విజయసాయి రెడ్డి చేసినవే. నిజానికి, ఆ వ్యాఖ్యలు చెప్పకపోయినా, వైసీపీ నాయకులు కూడా కూటమి బలంగా ఉన్నప్పటి వరకు తమకు విజయం సాధించడం కష్టమే అన్న విషయం అంగీకరిస్తున్నారు.గత ఎన్నికల్లో జనసేన పై కేంద్రీకృత విమర్శలు, వైసీపీ పరోక్ష చర్యల ద్వారా కూటమి బలాన్ని పెంచడమే ప్రధాన వ్యూహంగా నిలిచింది. పవన్ కళ్యాణ్ ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, "వైసీపీ కూటమికి బలాన్ని ఇచ్చింది, కాబట్టి కూటమి సరిగా ఉంటే విజయం సాధించగలదు" అని రాజమండ్రిలో ప్రకటించారు. ఎన్నికల సందర్భంలో, వైసీపీ కూటమి బలాన్ని బలపరిచే విధంగా ప్రవర్తించి..తన ఓటమికి స్వయంగా కారణం అయ్యింది.2024 ఎన్నికల్లో కూటమిలో భాగమైన మూడు పార్టీలు కలిసి ఎన్నికల్లో వెళ్లడమే వైసీపీకి సవాల్ గా మారింది అనడంలో డౌట్ లేదు. భవిష్యత్తులో కూడా కూటమి బలంగా ఉండటం వల్ల స్థానిక స్థాయిలో వైసీపీకి ఎదురుదెబ్బలు తగలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాజకీయ విశ్లేషకులు చెబుతున్న విధంగా, ప్రస్తుత ప్రభుత్వం పై వ్యతిరేకత ఎక్కువగా ఉండటం సాధారణమే. ప్రజలు అందకపోయిన సంక్షేమ కార్యక్రమాల కోసం నిరుత్సాహపడటం సహజమే, కానీ ఇది వైసీపీకి నేరుగా లాభం ఇవ్వడం లేదు.అంచనాల ప్రకారం, వైసీపీ తనకు బలహీనంగా ఉన్న జిల్లాలపై ఎక్కువ దృష్టి పెట్టడం, బలంగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ ఫోకస్ పెట్టడం వల్ల, ఓట్ల సమీకరణంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందువల్ల, ఒక ప్రాంతంలో ఓట్లు తగ్గినా, మరో ప్రాంతంలో వ్యూహాత్మకంగా పనిచేస్తే, అది సమతుల్యంగా బలం సమీకరించగలదు. చంద్రబాబు నాయుడు , పవన్ కల్యాణ్ ( ఇప్పటికే తమ వ్యూహాలు సజావుగా అమలు చేస్తున్నారు.మొత్తంగా, కూటమి బలంగా ఉండడం, స్థానిక వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయడం వల్ల వైసీపీకి ఛాన్స్ తక్కువగా ఉంది. ఒక ప్రాంతంలో ఓట్లు తక్కువగా రావడం వల్ల వచ్చే నష్టాన్ని మరొక ప్రాంతంలో పూరించగలిగే అవకాశం కూటమికి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో, వైసీపీని అతి జాగ్రత్తగా వ్యూహాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో, గతంలో విజయసాయి రెడ్డి అన్న , "కూటమి బలంగా ఉన్నంత వరకు వైసీపీకి విజయం సాధించడం చాలా కష్టం" వ్యాఖ్యలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి అన్న చర్చ సాగుతోంది. వచ్చే ఎన్నికల్లో కూటమిని ఎదుర్కోవడానికి వైసీపీ వ్యూహాలు ఎలా పనిచేస్తాయో చూడాలి.

# రేపు జరిగే టీ20 వరల్డ్ కప్ ఫైనల్ కు అంపైర్లు వీరే!

**టీ20 ప్రపంచకప్ ఫైనల్ అంపైర్లుగా ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్**

**వరుసగా రెండోసారి టీ20 ఫైనల్‌లో బాధ్యతలు చేపట్టనున్న ఇల్లింగ్‌వర్త్**

**తొలిసారి సీనియర్ వరల్డ్ కప్ ఫైనల్ అంపైర్‌గా అలెక్స్ వార్ఫ్**

**మ్యాచ్ రిఫరీగా ఆండీ పైక్రాఫ్ట్, థర్డ్ అంపైర్‌గా అల్లావుద్దీన్ పాలేకర్**

**హోమ్ గ్రౌండ్‌లో కప్పు కొట్టాలని సూర్యకుమార్ సేన పట్టుదల**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 తుది సమరానికి రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఈ ఆదివారం భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న ప్రతిష్ఠాత్మక ఫైనల్ మ్యాచ్‌కు ఐసీసీ అంపైర్లను ఖరారు చేసింది. ఈ మెగా ఫైట్‌లో ఇంగ్లాండ్‌కు చెందిన రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్ ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనున్నారు. రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్‌కు అంపైర్‌గా ఇది వరుసగా రెండో టీ20 ప్రపంచకప్ ఫైనల్ కావడం విశేషం. 2024లో బార్బడోస్ వేదికగా టీమిండియా విజేతగా నిలిచిన ఫైనల్ మ్యాచ్‌లోనూ క్రిస్ గఫానీతో కలిసి ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. అంతేకాకుండా 2023 వన్డే వరల్డ్ కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్‌లోనూ ఆయన అంపైర్‌గా వ్యవహరించారు. మరోవైపు ఇంగ్లాండ్ మాజీ పేసర్ అలెక్స్ వార్ఫ్‌కు సీనియర్ వరల్డ్ కప్ ఫైనల్‌లో అంపైరింగ్ చేయడం ఇదే తొలిసారి. కోల్‌కతాలో దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ విజయం సాధించిన సెమీఫైనల్ మ్యాచ్‌లోనూ వీరిద్దరే అంపైర్లుగా ఉన్నారు. ఈ ఫైనల్ మ్యాచ్‌కు మ్యాచ్ రిఫరీగా జింబాబ్వేకు చెందిన ఆండీ పైక్రాఫ్ట్, థర్డ్ అంపైర్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన అల్లావుద్దీన్ పాలేకర్, ఫోర్త్ అంపైర్‌గా అడ్రియన్ హోల్డ్‌స్టాక్ వ్యవహరిస్తారు. పాలేకర్ ఈ టోర్నీలో ఇప్పటికే ఆరు మ్యాచ్‌లకు సేవలందించారు. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి, సొంతగడ్డపై కప్పు ఎత్తిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించాలని పట్టుదలతో ఉంది. మరోవైపు మిచెల్ సాంట్నర్ కెప్టెన్సీలోని కివీస్ జట్టు తమ తొలి టీ20 వరల్డ్ కప్ టైటిల్ కోసం తహతహలాడుతోంది. సెమీస్‌లో ఫిన్ అలెన్ కేవలం 33 బంతుల్లోనే రికార్డు సెంచరీతో చెలరేగడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఆదివారం జరగనున్న ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# దారుణంగా ఆడుతున్న అభిషేక్ శర్మ.. ఫైనల్లో తుది జట్టులో ఉంటాడా..?

**వరుస వైఫల్యాలతో నిరాశపరుస్తున్న ఓపెనర్ అభిషేక్ శర్మ**

**ఫైనల్లో అభిషేక్ స్థానంలో రింకూ సింగ్‌ను తీసుకోవాలంటూ డిమాండ్**

**ఫామ్ లేని ప్లేయర్‌తో రిస్క్ చేయొద్దంటున్న నెటిజన్లు**

**ఆదివారం అహ్మదాబాద్ వేదికగా భారత్–న్యూజిలాండ్ ఫైనల్ మ్యాచ్**




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026 తుది దశకు చేరుకుంది. అహ్మదాబాద్ వేదికగా ఆదివారం జరగనున్న ఫైనల్ పోరులో భారత్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. అయితే ఈ కీలక మ్యాచ్‌కు ముందు టీమిండియా కూర్పుపై, ముఖ్యంగా ఓపెనర్ అభిషేక్ శర్మ స్థానంపై తీవ్ర చర్చ నడుస్తోంది. టోర్నీ ఆసాంతం అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో, ఫైనల్ కోసం అతన్ని కొనసాగించాలా? లేక డేరింగ్ నిర్ణయం తీసుకొని ఫినిషర్ రింకూ సింగ్‌ను జట్టులోకి తీసుకోవాలా? అనే ప్రశ్న ఇప్పుడు అభిమానులను, విశ్లేషకులను తొలుస్తోంది. ఈ టోర్నీలో అభిషేక్ గణాంకాలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఇప్పటివరకు ఆడిన ఏడు మ్యాచ్ లలో అతను కేవలం 89 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో జింబాబ్వేపై చేసిన ఒక అర్ధసెంచరీ (55) మినహా.. మిగతా మ్యాచుల్లో 0, 0, 0, 15, 10, 9 స్కోర్లకే పరిమితమయ్యాడు. అతని సగటు కేవలం 12.71 మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో కీలకమైన ఫైనల్ మ్యాచ్‌లో ఇలాంటి ఫామ్ లేని ఆటగాడిని నమ్ముకోవడం రిస్క్ అవుతుందని సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. "నిలకడగా విఫలమవుతున్న ఆటగాడితో ఫైనల్ మ్యాచ్‌లో ప్రయోగం చేయకూడదు. రింకూ సింగ్ వంటి మ్యాచ్ విన్నర్‌ను తీసుకోవాలి" అని ఒక అభిమాని కామెంట్ చేయగా, "అభిషేక్ ఆటతీరును ప్రత్యర్థులు పసిగట్టారు, కివీస్ బౌలర్లు అతన్ని సులభంగా కట్టడి చేస్తారు" అని మరొకరు విశ్లేషించారు. అయితే మరికొందరు మాత్రం అభిషేక్ ఫైనల్లో 'ఎక్స్ ఫ్యాక్టర్'గా మారతాడని, కీలక సమయంలో భారీ ఇన్నింగ్స్ ఆడతాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
ప్రస్తుతం కెప్టెన్ సూర్యకుమార్
యాదవ్, కోచ్ గౌతమ్ గంభీర్ ముందు పెద్ద సవాల్ ఉంది. విన్నింగ్ కాంబినేషన్‌నే కొనసాగిస్తారా? లేక ట్రోఫీ కోసం కఠిన నిర్ణయం తీసుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది. దాదాపుగా మార్పులు ఉండకపోవచ్చని తెలుస్తున్నా, ఫైనల్ ఒత్తిడి దృష్ట్యా రింకూ సింగ్ పేరును పరిశీలించే అవకాశం లేకపోలేదు.

# వామ్మో.. ఫైనల్ మ్యాచ్ ఆ మోదీ స్టేడియంలోనా.. ఇండియా కష్టమే అంటూ రచ్చ రచ్చ !




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 సెమీ ఫైనల్ మ్యాచ్?లో టీమిండియా గెలిచి ఫైనల్?కు వెళ్లినప్పటికీ అభిమానులను మాత్రం ఒక విషయం టెన్షన్ పెడుతోంది. అదే.. ఫైనల్ మ్యాచ్?కు అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదిక కావడం. ఈ స్టేడియం టీమిండియాకు అస్సలు కలిసి రావడం లేదని.. వేదిక మార్చాలని టీమిండియా అభిమానుల్లో కొందరు నెట్టింట డిమాండ్ చేస్తున్నారు. అయితే.. ఈ డిమాండ్లకు తలొగ్గే పరిస్థితి లేనప్పటికీ అహ్మదాబాద్ స్టేడియంపై అభిమానుల అసంతృప్తికి కారణం లేకపోలేదు. 2023 ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ వన్డే వరల్డ్ కప్ మ్యాచ్ ఇదే స్టేడియంలో జరిగింది. టీమిండియా, ఆస్ట్రేలియా జట్లు తలపడ్డాయి. ఆస్ట్రేలియా జట్టు 6 వికెట్ల తేడాతో 42 బంతులు మిగిలి ఉండగానే టీమిండియాను చిత్తు చేసి వరల్డ్ కప్ టైటిల్ గెలిచింది. ఈ మ్?యచ్ రిజల్ట్ గుర్తొచ్చినప్పుడల్లా.. ఆస్ట్రేలియా క్రికెటర్ ట్రావిస్ హెడ్ సృష్టించిన విధ్వంసం కళ్ల ముందు కదిలాడుతుంది. 137 పరుగులు చేసి ఎవరూ ఊహించని విధంగా టీమిండియాను

ఘోరంగా దెబ్బ తీశాడు. టీమిండియా ఇలా కప్ చేజార్చుకున్న మ్యాచ్ నరేంద్ర మోదీ స్టేడియంలోనే జరిగింది. అంతెందుకు.. మొన్నటికి మొన్న సూపర్–8లో సౌతాఫ్రికా చేతిలో టీమిండియా ఓడిపోయిన మ్యాచ్?కు కూడా అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియమే వేదికగా నిలిచింది. ఇన్ని చేదు జ్ఞాపకాలకు సాక్ష్యంగా నిలిచిన స్టేడియం కావడంతో ఈ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ వద్దు బాబోయ్ అని టీమిండియా అభిమానులు సోషల్ మీడియా సాక్షిగా గగ్గోలు పెడుతున్నారు. అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియంలో ఫైనల్ జరిగితే టీమిండియా ఓడిపోతుందనే భయం కొందరు టీమిండియా అభిమానులను వెంటాడుతుంది.

# చైతూ ఇప్పటికి మెయిన్ గేమ్‌లోకి వచ్చాడా?



**ఆషికా రంగనాథ్ రీగల్ పర్పుల్ లెహంగా మ్యాజిక్**

టాలీవుడ్‌లో హీరోలకు కొదవలేదు. ఇతర ఇండస్ట్రీలతో పోలిస్తే మన దగ్గర హీరోలు చాలా మందే ఉన్నారు. ఇందులో స్టార్స్ కుటుంబాల వారసులు కూడా ఎక్కువే. అయితే చాలా వరకు స్టార్స్ ఫ్యామిలీ వారసుల్లో కొంత మంది ఇప్పటి వరకు వారికున్న యాక్టింగ్ ప్రొటెన్షియాలిటీకి తగ్గ సక్సెస్‌లని, ఆ స్థాయి కథలని..క్యారెక్టర్లని ఇంత వరకు చేయలేకపోతున్నావారు ఇద్దరు ముగ్గరున్నారు. వారిలో ముందు వరుసలో నిలుస్తున్నహీరో అక్కినేని నాగచైతన్య. అక్కినేని నాగార్జున వారసుడిగా అరంగేట్రం చేసినా ఇంత వరకు తన సత్తాకు తగ్గ క్యారెక్టర్, సినిమా చేయలేకపోతున్నాడు.



అలాంటి కథల్ని ఎంచుకుని రేస్‌లో ముందుకు రాలేకపోతున్నాడు అనే భావన అక్కినేని అభిమానుల్లో గత కొంత కాలంగా వినిపిస్తూనే ఉంది. చైతూ ఫస్ట్ మూవీ -జోష్-. ఇందులో తను ప్రదర్శించిన నటన, చూపించిన హావభావాలు, ప్రదర్శించిన యాటిట్యూడ్ మరే సినిమాలో చూపించలేదు. ఫస్ట్ మూవీలోనే అనుభవం ఉన్న ఆర్టిస్ట్‌లా అన్ని వేరియేషన్స్ చూపించిన నాగచైతన్యలో మంచి నటుడు ఉన్నాడని ఫస్ట్ మూవీతో అందరికి అర్థమైంది. కానీ తనకు తగ్గ కథలని ఇప్పటి వరకు చేయలేదు నాగాచైతన్య. నటుడిగా, హీరోగా అతనికున్న ప్రొటెన్షియలిటీకి తగ్గ సినిమా చేస్తే చూడాలని గత కొన్నేళ్లుగా అక్కినేని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అది ఇప్పటికి నెరవేరబోతున్నట్టుగా తెలుస్తోంది. నాగచైతన్య నటిస్తున్న తాజా మూవీ -వృశకర్మ-. చైతూ నటిస్తున్న 24వ సినిమా ఇది. మీనాక్షీ చౌదరి కథానియికగా నటిస్తోంది. ఇదొక మిస్టికల్ యాక్షన్ థ్రిల్లర్. -విరూపాక్ష- ఫేమ్ కార్తిక్ దండు దర్శకుడు. ట్రెజర్ హంటర్‌గా నాగచైతన్య నటిస్తున్నాడు. ఈ మూవీ బడ్జెట్ రూ.120 కోట్లు. చైతూ కెరీర్‌లో ఈ స్థాయి భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఫస్ట్ మూవీ ఇది. తాజాగా ఈ మూవీ గ్లింప్స్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. గత చిత్రాలకు భిన్నంగా చైతూ ఇందులో కనిపిస్తున్నాడు. కంటెంట్, క్యారెక్టర్ చాలా ఇంటెన్సిటీతో పవర్ ఫుల్‌గా సాగుతుదని తెలుస్తోంది. గ్లింప్స్ చూసిన తరువాత అక్కినేని అభిమానులు ఇది కదా నాగచైతన్య నుంచి ఇన్నాళ్లుగా కోరుకుంటోందని హ్యాపీ ఫీలవుతున్నారు. చైతూ మాత్రం అంతకు మించి చెబుతున్నాడు. తన కెరీర్‌ని మలుపు తిప్పే సినిమా ఇదని బాహాటంగానే చెబుతున్నాడు. ఈ మూవ్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నా.. నా కెరీర్‌లోనే ఇదొక బెస్ట్ మూవీ అవుతుందని గట్ ఫీలింగ్‌తో చెబుతుండగం గమనార్హం.గతంలో దేవ కట్టతో చేసిన -ఆటోనగర్ సూర్య- సినిమాతో నాగచైతన్య స్టార్ లీగ్‌లోకి ఎంటరవుతాడని అంతా భావించారు. దానికి సంబంధించిన డైలాగ్ టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాల్ని పెంచేయడంతో అభిమానులు కూడా ఖుషీ అయ్యారు. కంటెంట్ మిస్‌ఫైర్ కావడం, రిలీజ్ డిలే కావడంతో ఆశించిన స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేకపోయింది. మళ్లీ ఇన్నాళ్లకు -వృశకర్మ-తో అక్కినేని అభిమానులు ఎదురుచూస్తున్న కమర్షియల్ బ్లాక్ బస్టర్ చైతూకు రాబోతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. చైతూ కూడా చాలా స్ట్రాంగ్‌గా చెబుతున్నాడు. ఈ సారి ఫ్యాన్స్ ఎదురు చూస్తున్న కమర్షియల్ సక్సెస్ కొట్టేస్తామని..అంతా ఆశిస్తున్నట్టే -వృశకర్మ- బ్లాక్‌బస్టర్ హిట్ అయితే చైతూ కెరీర్ మరో మలుపు తిరగడం ఖాయం.



**రియా చక్రవర్తి సొగసైన రెడ్ శారీ లుక్‌లో స్టన్స్**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965